మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు


NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 28-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 149 Issue: 149

Published from Jagitial
www.evarthalu.com

28 నవంబర్ 2025 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:32 సూర్యాస్తమయం - సా. 5:36 తిథిః అష్టమి రా. 12:10ం వరకు తరువాత నవమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం శతభిష రా. 2:37ం వరకు తరువాత పూర్వాభాద్ర యోగం వృఘతా ఉ. 10:57 వరకు కరణం విష్టి మ. 12:24 వరకు బవ రా. 12:10ం వరకు వర్జ్యం ఉ. 9:49 నుండి ఉ. 11:26 వరకు దుర్ముహూర్తం ఉ. 8:45 నుండి ఉ. 9:29 వరకు మ. 12:26 నుండి మ. 1:10 వరకు రాహుకాలం ఉ. 10:41 నుండి మ. 12:04 వరకు యమగండం మ. 2:50 నుండి సా. 4:13 వరకు గుళికాకాలం ఉ. 7:55 నుండి ఉ. 9:18 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:56 నుండి తె. 5:44 వరకు అమృత ఘడియలు రా. 7:31 నుండి రా. 9:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:41 నుండి మ. 12:26 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## 2015 గ్రూప్2 ర్యాంకర్లకు ఊరట

**సింగిల్ బెంచ్ తీర్పును సస్పెండ్ చేసిన హైకోర్టు**

తెలంగాణ గ్రూప్ 2 (2015) వివాదంపై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) నేతృత్వంలోని ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పుతో గ్రూప్ 2 ర్యాంకర్లకు ఊరట లభించింది. 2015-16 లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. 2



2

## కోర్టు అంటే లెక్కలేదా?

**నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తాం.. రంగనాథ్‌కు హైకోర్టు వార్నింగ్**



2

## మీ దర్యాప్తు ఇంకెన్నేళ్లు

**సిగాచీ ఘటన హైకోర్టు ఆగ్రహం**

సిగాచీ పేలుళ్ల ఘటనలో పోలీసుల దర్యాప్తు తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది సాధారణ ఘటన కాదని 54 మంది కార్మికులు సజీవ దహనమైన భారీ ప్రమాదమని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్ అన్నారు. ఇంత తీవ్రమైన ప్రమాద ఘటనలో ఇంకా దర్యాప్తు కొనసాగుతుందని చెప్పడమేంటని ఏఏజీ తేరా రజినీకాంత్ రెడ్డిని ప్రశ్నించారు.

# రంజుగా కర్నాటకం!



## డీకే, సిద్ధరామయ్య మధ్య 'మాట' ప్రదర్శనలు

- మాట నిలబెట్టుకోవాలని డీకే శివకుమార్ ట్వీట్
- మాట తమకు ప్రపంచం అంటూ సిద్ధ కౌంటర్
- తారాస్థాయికి చేరిన 'పవర్ షేరింగ్' ఉద్రిక్తతలు
- ఇద్దరినీ ఢిల్లీకి పిలిచిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే
- సీఎం పీఠం ఎవరిది? రేపు కొలిక్కి వచ్చే చాన్స్

అది 2023 మే నెల.. కర్ణాటకలో కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలుపొందింది. ఆ గెలుపులో అప్పటి పీసీసీ చీఫ్, ప్రస్తుత డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌దే అసలైన పాత్ర. ఆయన లేకపోతే కర్ణాటకలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలే ఉండకపోయేవి. అంతా తానై నడిపించడంతో సీఎం పీఠం కూడా ఆయనకే దక్కుతుందని అంతా భావించారు. కానీ.. తన సీనియర్ సిద్ధరామయ్యకు అవకాశం వచ్చింది. 50-50 పవర్ షేరింగ్ జరుగుతుందన్న ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. అంటే.. చెరో రెండున్నరేళ్లు సీఎంగా ఉండాలన్నది ఒప్పందం అన్నమాట. దీనిపై అధికారికంగా ఎక్కడా ప్రకటన చేయకపోయినా, డీకే ఎమ్మెల్యేలు ఇదే మాటను సందర్భానుసారం చెప్తూ వచ్చారు. అన్నట్లుగానే సిద్ధరామయ్య అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తయ్యింది. దీంతో అక్కడ అసలు కథ మొదలైంది. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న 'కర్నాటకం' రంజుగా సాగుతోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

బెంగళూరు/న్యూఢిల్లీ: కర్ణాటకలో పవర్ షేరింగ్ వివాదం కొనసాగుతోంది. ఇప్పటికే ఈ విషయంలో హై కమాండ్ అన్ని రకాలుగా చర్చించి నిర్ణయం తీసుకుంటుందని పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఇటీవల సీఎం సిద్ధరామయ్య ఖర్గేతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో నేతల మధ్య మాటలు, సోషల్ మీడియా పోస్టులు ఆసక్తికరంగా మారుతున్నాయి. తాజాగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సామాజిక మాధ్యమాల వేదికగా చేసిన పోస్టులు మరింత చర్చకు దారితీస్తున్నాయి. గురువారం ఉదయం డీకే తన ట్విట్టర్‌లో.. 'మాట నిలబెట్టుకోవడం కంటే గొప్ప విషయం ప్రపంచంలో మరోటి లేదు' అనే అర్థం వచ్చేలా పోస్ట్ చేశారు. దానికి 'వర్డ్ పవర్ ఈజ్ వరల్డ్ పవర్' అంటూ ఓ పోస్టర్‌ను జత చేశారు. న్యాయమూర్తి, అధ్యక్షుడు.. ఇలా ఎవరైనా సరే మాట తరువాయి 2 వ పేజీలో...




## దీప్తి శర్మకు 3.2 కోట్లు

- డబ్ల్యూపీఎల్ వేలంలో జాక్‌పాట్
- వదిలేసిన ఫ్రాంచైజీనే కొనుగోలు
- ఆమెకోసం రైట్ టు మ్యాచ్ కార్డు
- షాక్ తిన్న ఢిల్లీ సభ్యుడు గంగూలీ

న్యూఢిల్లీ: డబ్ల్యూపీఎల్ వేలంలో టీమిండియా మహిళా క్రికెటర్ దీప్తి శర్మ రూ.3.2 కోట్లకు యూపీ సొంతమైంది. అయితే, వేలంలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. డబ్ల్యూపీఎల్ 2026 మెగా వేలం ఢిల్లీ వేదికగా జరుగుతోంది. ఇందులో ఇటీవల -2 వ పేజీలో...




2

## ఆధార్‌తో పౌరసత్వం రాదు

- ఓటు హక్కుకు రుజువుగా పరిగణించం
- సంక్షేమ పథకాలకు మాత్రమే వర్తింపు
- మరోసారి స్పష్టం చేసిన సుప్రీం కోర్టు
- చొరబాటుదారులకు ఆధార్ జారీపై ఆందోళన
- జాబితా సవరణపై ఈసీకి డిసెంబర్ 1 వరకు గడువు

దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారికి కూడా ఆధార్ కార్డులు అందుతున్నాయని, అలాంటప్పుడు ఆధార్ కార్డు ఉన్నంత మాత్రాన వారికి ఓటు హక్కు కూడా కల్పించాలా? అని సుప్రీంకోర్టు కీలక ప్రశ్న లేవనెత్తింది. ఆధార్ కార్డు కేవలం సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేరవేయడానికి మాత్రమేనని, దానిని పౌరసత్వానికి లేదా ఓటు హక్కుకు రుజువుగా పరిగణించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.



### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,775 |
| వెండి (గ్రాము): | రూ.180 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,622 |



## అభివృద్ధిని ప్రతిబింబించాలి

**రైజింగ్ పాలసీ నివేదికపై సీఎం**

రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దేందుకు స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీ డాక్యుమెంట్‌లో కనిపించాలన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని 3 రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలన్నారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా విభజించుకోవాలని సూచించారు.


హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): ఈ మూడు రీజియన్లలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి చేయాలో డాక్యుమెంట్‌లో పొందుపరచాలన్నారు. వాస్తవిక దృక్పథం కనిపించేలా డిజైన్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గురువారం రైజింగ్ డాక్యుమెంట్‌పై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, యువతకు మెరుగైన ఉపాధి లక్ష్యంగా అందరికీ సమాన అవకాశాలు, సమీకృత అభివృద్ధే లక్ష్యంగా రానున్న 22 ఏళ్లకు భవిష్యత్ తరువాయి 2 వ పేజీలో...

## అయ్యప్పలకు డ్రెస్ కోడ్ విమక్తినివ్వాలి!

**తెలంగాణ డీజీపీ ఆఫీస్ ముట్టడిలో స్వాములు**



తెలంగాణ డీజీపీ కార్యాలయాన్ని అయ్యప్ప స్వాములు ముట్టడించారు. అయ్యప్ప మాల వేసుకున్న పోలీసులు కూడా యూనిఫాం ధరించాలంటూ ఆంక్షలు విధించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఈ రూల్స్ ఉన్నాయంటూ స్వాములు మండిపడ్డారు. అయ్యప్ప స్వాములకు మద్దతుగా బీజేవైఎం కార్యకర్తలు కూడా డీజీపీ కార్యాలయానికి తరలివచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. 2



## 83కు చేరిన హాంకాంగ్ మృతులు

**ఇంకా 280 మంది మిస్సింగ్**

హాంకాంగ్‌లోని బహుళ అంతస్తుల భవన సముదాయంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. ఇప్పటివరకు ఈ ఘటనలో మృతుల సంఖ్య 83కి చేరింది. 76 మందికి గాయాలు కాగా, 28 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అక్కడి అధికారులు వెల్లడించారు.

హాంకాంగ్: మరో 280 మంది ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అనేక మంది ఇంకా భవనాల్లోనే చిక్కుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం ఏడు బ్లాకులు మంటల్లో చిక్కుకోగా.. నాలుగింటిలో ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయి. మిగతా మూడు భవనాల పైభాగంలో గురువారం సాయంత్రం -2 వ పేజీలో...

### విశ్వవాణి



అండంలోకి శుక్రకణం ప్రవేశించే సమయంలో మెరుపు లాంటిది కనిపిస్తున్నట్లు అమెరికాలోని ఆర్గోన్ నేషనల్ లాబరేటరీ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ సందర్భం.. అండం పిండంగా అభివృద్ధి చెందే తొలి దశకు నాందిగా పేర్కొంటున్నారు. దీనికి 'జింక్ స్పార్క్' అని నామకరణం చేశారు.

## ఫ్రీ బస్ ఎందుకు?

**కావాలని మహిళలు అడిగారా?.. వెంకయ్య నాయుడు అసహనం**

ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాలపైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తీవ్రవ్యాఖ్యలు చేశారు. గురువారం గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన సేవాజ్యోతి పురస్కార ప్రదాన ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఉచితాలు ఇవ్వాలని ఎవరడిగారు? అంటూ ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో అందిస్తున్న ఉచిత పథకాలను ఉద్దేశించి ఉచిత బస్సు ఇవ్వండి.. అందులో మేము తిరుగుతాం.. అని మహిళలు అడిగారా? అని సూటి ప్రశ్న వేశారు. మరి ప్రభుత్వాలు ఎందుకు ఇటువంటి పథకాలను తీసుకు వస్తున్నాయని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి తరువాయి 2 వ పేజీలో...



ఈవార్తలు



# రాశి ఫలాలు



28.11.2025

మేషం: మిత్రులతో దైవదర్శనాలు చేసుకుంటారు. నూతన కార్యక్రమాలు ప్రారంభంలో అవరోధాలు తొలగుతాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆప్తుల నుండి అందిన శుభవార్తలు కొంత ఉత్సాహాన్నిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక లాభాలు అందుకుంటారు.

వృషభం: వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. బంధువులతో వివాదాలు చికాకు పరుస్తాయి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత కలుగుతుంది. సంతాన ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు.

మిథునం: ఉద్యోగులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తారు. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారాలు లాభాల బాట పడతాయి. బందు మిత్రులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది.

కర్కాటకం: నూతన వాహన యోగం ఉన్నది. వ్యాపార, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. నూతన వ్యక్తులతో పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. ఋణదాతల నుండి ఒత్తిడి అధిగమిస్తారు. ఆకస్మిక ధనలాభం సూచనలు ఉన్నవి. బంధువర్గం నుండి విలువైన సమాచారం అందుతుంది.

సింహం: కొన్ని వ్యవహారాలలో సొంత ఆలోచనలు కలసిరావు. నూతన రుణ ప్రయత్నాలు చేస్తారు. దైవ సేవా కార్యక్రమాలకు ధనవ్యయం చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలు కొంత చికాకు పరుస్తాయి. బంధువులతో మాట పట్టింపులు ఉంటాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

కన్య: వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థికంగా కొంత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. అధికారులతో సఖ్యత కలుగుతుంది. కుటుంబ పెద్దల నుండి అవసరానికి ధనసహాయం అందుతుంది. చేపట్టిన పనుల్లో అవాంతరాలు అధిగమిస్తారు.

తుల: వ్యాపారాల విస్తరణకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో అదనపు పనిభారం నుండి ఉపశమనం కలుగుతుంది. బంధువర్గం నుండి శుభవార్తలు అందుతాయి. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. జీవిత భాగస్వామితో దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సంతాన విద్యా విషయాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు.

వృశ్చికం: సహోద్యోగులతో మాటపట్టింపులు తొలగుతాయి. ఇంటాబయట అనుకూల పరిస్థితులు ఉంటాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఇతరుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

ధనస్సు: విందువినోదాలు కార్యక్రమాలకు ధనవ్యయం చేస్తారు. ఇంటా బయట అకారణ వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలు నిరుత్సాహ పరుస్తాయి. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు.

మకరం: కుటుంబమునకు కొందరి ప్రవర్తన వలన శిరోబాధలు తప్పవు. చేపట్టిన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. నూతన రుణాలు చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో నిరాశ తప్పదు. ముఖ్యమైన వ్యవహారాలలో శ్రమకు ఫలితం కనిపించదు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు తొలగుతాయి.

కుంభం: వృత్తి ఉద్యోగాలలో నీ ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి,వ్యాపారాలు సజావుగా సాగుతాయి. అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

మీనం: వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. చిన్ననాటి మిత్రులతో కలహ సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులు వాయిదా వేస్తారు. ఉద్యోగమున అధికారులతో వివాదాలు తప్పవు. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ధన పరంగా ఒడిదుడుకులు అధికమవుతాయి.

# రంజుగా కర్నాటకం!

మొదటి పేజీ తరువాయి

మీద నిలబడాల్సిందే అని ఆ పోస్టు సారాంశం. ఈ ట్వీట్‌కు కౌంటర్ అన్నట్లుగా సిద్ధరామయ్య కూడా ఓ ట్వీట్ చేశారు. ప్రజలు తమకు కొంత కాలం కోసం మాత్రమే అధికారం ఇవ్వలేదని.. ఐదేళ్లూ పాలించేందుకు ఆమోదం తెలిపారని సీఎం సిద్ధరామయ్య 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'కన్నడ ప్రజలు మాకిచ్చిన తీర్పు కేవలం ఒక క్షణం కోసం కాదు.. అది ఐదేళ్ల పూర్తి బాధ్యత. నాతో సహా కాంగ్రెస్ పార్టీ మా ప్రజలకు ఇచ్చిన మాటలను చేతల్లో చేసి చూపిస్తున్నాం. కన్నడ ప్రజలకు మేం ఇచ్చిన 'మాట' కేవలం ఒక నినాదం కాదు.. అదే మాకు ప్రపంచం' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మహిళల కోసం ప్రత్యేకంగా ప్రారంభించిన 'శక్తి' పథకం పురోగతిని వెల్లడిస్తూ.. 'ప్రజల ప్రపంచాన్ని ఉత్తమంగా మార్చనిదే ఆ మాటకు శక్తి ఉండదు' అంటూ ఓ పోస్ట్ పెట్టారు. దీంతో ఒక్కసారిగా కర్ణాటకలో పొలిటికల్ హీట్ జోరందుకుంది. సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు డీకేకు కౌంటరేనంటూ పలు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. 'మాట' నిలబెట్టుకోవాలనే ఉద్దేశంతో డీకే వ్యాఖ్యలు చేశారని, దానికి సిద్ధరామయ్య కౌంటర్ ఇచ్చినట్లుగానే భావించాలని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## స్వరం మార్చిన సిద్ధరామయ్య

జూలై 2025 వరకు.. 'పూర్తి ఐదు సంవత్సరాలు నేనే సీఎంగా కొనసాగుతాను.. ఇందులో ఎలాంటి మార్పు ఉండదు' అని సిద్ధరామయ్య పదే పదే చెప్పారు. అయితే, ఈ నెల 22న మల్లికార్జున్ ఖర్గేతో సమావేశమైన తర్వాత.. ఆయన స్వరం మారిపోయింది. ఈ నిర్ణయాన్ని హైకమాండ్‌కు వదిలేశారు. ఒకవేళ డీకే శివకుమార్ సీఎం బాధ్యతలు స్వీకరించినా.. పార్టీకి చెందిన కీలక బాధ్యతలను సిద్ధరామయ్యకు కట్టబెడతారని పార్టీ అధికారుల సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. సిద్ధరామయ్య దాదాపు 8 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, ఐదు సంవత్సరాలు ప్రతిపక్ష నాయకుడిగా, ఒకటిన్నర సంవత్సరాలు సమన్వయ కమిటీ అధిపతిగా పనిచేశారు. కాబట్టి, ఆయనకు తిరిగి పార్టీ బాధ్యతలను అప్పగించడం నైతికంగా అవసరమని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు.. డీకే శివకుమార్ నైపుణ్యం, ఓపికతో వేచి చూస్తున్నారు. కర్ణాటకలో అధికార సమతుల్యత రాజస్థాన్ లేదా ఛత్తీస్‌గఢ్ లాగా లేదని పార్టీలోనే ఆయనకు గుర్తింపు ఉంది. కాగా.. ఈ 2.5 సంవత్సరాల ఒప్పందం ఫలిస్తుందా? అన్నది శనివారం తేలే అవకాశం ఉంది. దీనికోసం డీకే, సిద్ధరామయ్యను ఖర్గే ఢిల్లీకి పిలిచారు. వీరితో రాహుల్ గాంధీ, ఖర్గే భేటీ అయ్యి ఓ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

# మీ దర్యాప్తు ఇంకెన్నేళ్లు

## సిగాచీ ఘటన హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): సిగాచీ పేలుళ్ల ఘటనలో పోలీసుల దర్యాప్తు తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది సాధారణ ఘటన కాదని 54 మంది కార్మికులు సజీవ దహనమైన భారీ ప్రమాదమని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్ అన్నారు. ఇంత తీవ్రమైన ప్రమాద ఘటనలో ఇంకా దర్యాప్తు కొనసాగుతుందని చెప్పడమేంటని ఏఏజీ తేరా రజినీకాంత్ రెడ్డిని ప్రశ్నించారు. సంగారెడ్డిలో సిగాచీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో దర్యాప్తు జరుగుతున్న తీరుపై హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. 54 మంది కార్మికులు మృతిచెందితే ఇంకా దర్యాప్తు జరుగుతుంది అని చెప్పడమేంటని ఏఏజీ తేరా రజనీకాంత్ రెడ్డిని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. ఇంత పెద్దఘటనకు డీఎస్పీని ఎందుకు దర్యాప్తు అధికారిగా నియమించారని అడిగారు. దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాల్సి ఉండవచ్చుగా అని ప్రశ్నించారు. 237మంది సాక్షులను విచారించినా ఇప్పటి వరకూ కేసులో ఎలాంటి పురోగతి లేదా అని అడిగారు. సిగాచీ ప్రమాద ఘటనపై బాబురావు అనే వ్యక్తి ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. పేలుడు సంబవించి ఐదు నెలలు దాటినా ఇప్పటివరకూ ఎవరినీ అరెస్టు చేయలేదని న్యాయవాది కోర్టుకు తెలిపారు. నిపుణుల కమిటీ సైతం పరిశ్రమ నిర్వహణలో లోపాలున్నాయని తేల్చింది. నిబంధనలకు విరుద్ధంగా 17 టన్నుల సోడియం క్లోరైడ్ నిల్వచేశారని కమిటీ గుర్తించిందని న్యాయవాది పేర్కొన్నారు. పేలుడు తీవ్రతతో ఎనిమిది మంది శరీరాలు ఆనవాళ్లు లేకుండా కాలిపోయాయని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న కోర్టు పోలీసు దర్యాప్తు నివేదిక కోర్టుకు సమర్పించాలని తెలిపింది. తదుపరి విచారణను డిసెంబర్ తొమ్మిదికి వాయిదా వేసింది.

## 2015 గ్రూప్2 ర్యాంకర్లకు ఊరట

### సింగిల్ బెంచ్ తీర్పును సస్పెండ్ చేసిన హైకోర్టు

హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): తెలంగాణ గ్రూప్ 2 (2015) వివాదంపై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) నేతృత్వంలోని ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పుతో గ్రూప్ 2 ర్యాంకర్లకు ఊరట లభించింది. 2015-16 లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. దీనిపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. వైట్ నర్, దిద్దుబాటు ఉన్న జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారని టీజీపీఎస్సీపై ఆరోపణలు చేశారు. ఈ కేసును విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం.. గ్రూప్ 2 లో ఎంపికైన వారి జాబితాను రద్దు చేసింది.

## ఫ్రీ బస్ ఎందుకు?

మొదటి పేజీ తరువాయి

కోసం సంపదను సృష్టించే మార్గాలను చూడాలి కానీ అప్పులు చేసి ఉచిత పథకాలు ఇవ్వడం సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏది ఉచితంగా ఇవ్వకూడదు అనేది తన అభిప్రాయమని తెలిపారు. ఉచిత పథకాల ద్వారా ప్రజలను సోమరిపోతులను చేసి, ఆపై వారిని తాగుడుకు బానిసలను చేసి, ప్రభుత్వాలు మళ్లీ ప్రజల నుండి డబ్బులు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ఇది భయంకరమైన నిజమని అన్నారు. పేద ప్రజలకు విద్య, వైద్యం మాత్రమే ఉచితంగా అందించాలని, మిగతావి ఉచితంగా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఉచిత పథకాలు ఇవ్వడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ఎవరైనా పార్టీ మారాలనుకుంటే ఆ పార్టీ ద్వారా పొందిన పదవులకు రాజీనామా చేయాల న్నారు.

## దీప్తి శర్మకు 3.2 కోట్లు

మొదటి పేజీ తరువాయి

జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో సత్తాచాటిన దీప్తి శర్మ కోసం ఫ్రాంఛైజీల మధ్య హైడ్రామా జరిగింది. మెగా వేలానికి ముందు యూపీ వారియర్స్ ఫ్రాంఛైజీ ఆమెను వదిలేసింది. దీంతో ఇతర ఫ్రాంఛైజీలు ఆమెపై కన్నేశాయి. అయితే వేలంలో మరోసారి యూపీ వారియర్స్ ఫ్రాంఛైజీనే ఆమెను దక్కించుకుంది. భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ రూ.50 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చింది. అయితే ఆమెను దక్కించుకునేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తొలి బిడ్ వేసింది. అదే ధరకు దక్కించుకుంటామని తెలిపింది. అయితే అనూహ్యంగా మిగతా ఫ్రాంఛైజీలు.. ఆమె కోసం పోటీ పడలేదు. దీంతో తక్కువ ధరకే ఢిల్లీ క్యాపిటల్స్.. స్టార్ ప్లేయర్‌ను దక్కించుకునేలా కనిపించింది. అనుకున్నట్లుగా ఢిల్లీ క్యాపిటల్స్ రూ.50 లక్షలకు దక్కించుకుంది. ఇక్కడే అసలు కథ మొదలైంది. ఇక్కడే యూపీ వారియర్స్ తమ వద్ద ఉన్న ఆయుధాన్ని బయటకు తీసింది. గతంలో తమ జట్టు తరఫున ఆడిన ప్లేయర్లను తిరిగి దక్కించుకునేందుకు ఉపయోగించే 'రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం)' కార్డును వినియోగించింది. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ సైతం భారీగా ధర పెంచేసింది. రూ.50 లక్షల నుంచి ఏకంగా రూ.3.2 కోట్ల బిడ్ వేసింది. దీంతో యూపీ వారియర్స్ వెనక్కి తగ్గుతుందని భావించింది. కానీ ఇక్కడే యూపీ ఫ్రాంఛైజీ ట్విస్ట్ ఇచ్చింది. అంతమొత్తం ఇచ్చి.. తామే దీప్తిని తీసుకుంటామని చెప్పింది. దీంతో వేలంలో ఢిల్లీ క్యాంప్‌లో ఉన్న సౌరభ్ గంగూలీ షాక్ అయ్యాడు. ఈ ధరతో డబ్ల్యూపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు రెండో అత్యధిక ధర కలిగిన భారత ప్లేయర్‌గా దీప్తి శర్మ నిలిచింది. ఈ జాబితాలో స్మృతి మంధాన అగ్రస్థానంలో ఉంది. ఆమెను ఆర్సీబీ గతంలో రూ.3.4కోట్లకు దక్కించుకుంది. గతంలో ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ న్యాట్ సీవియర్ బ్రంట్‌ను ముంబై ఇండియన్స్ రూ.3.2 కోట్లకు దక్కించుకుంది.

## 83కు చేరిన హాంకాంగ్ మృతులు

మొదటి పేజీ తరువాయి

కూడా మంటలు చెలరేగుతూనే కనిపించాయి. బాధితులను వెలికి తీసేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సురక్షితంగా బయటకు తీసుకువచ్చిన వందలాది మందిని తాత్కాలిక శిబిరాలకు తరలించారు. థాయ్ పో జిల్లాలో ఈ భవన సముదాయాన్ని 1983లో నిర్మించారు. ఎనిమిది టవర్లలో 1984 అపార్టుమెంట్లు ఉండగా.. 4600 మంది నివసిస్తున్నారు.

# అశ్లీల కంటెంట్.. ఆధార్ లింక్!

## సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ఓటీటీల్లో అశ్లీల కంటెంట్‌ను యాక్సెస్ చేయడానికి ఆధార్ ద్వారా వయస్సు ధ్రువీకరణను అమలు చేయవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. గురువారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తి జోయ్‌మల్య బాగ్చి నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం అశ్లీల కంటెంట్ విషయంలో కొన్ని సూచనలు చేసింది. 'పుస్తకం, పెయింటింగ్ మొదలైన వాటిలో అశ్లీలత ఉండవచ్చు. ఆ విషయాన్ని ముందుగానే చెబుతారు. కానీ, మీరు ఫోన్ ఆన్ చేసిన వెంటనే మీరు కోరుకోనిది, అశ్లీలమైనది ఏదైనా వస్తే, అప్పుడు ఏమి చేయాలి' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఓటీటీ షోల ప్రారంభంలో సాధారణ హెచ్చరికలు ఉన్నప్పటికీ, అదనపు చర్యగా వయస్సు ధ్రువీకరణ కూడా చేయవచ్చని సీజేఐ అన్నారు. యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌పై ఎవరో ఒకరు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. వ్యక్తులు సొంతంగా ఛానళ్లు ప్రారంభించి.. ఆ తర్వాత బాధ్యతారాహిత్యంగా ఉండటం వింతగా ఉందని సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారం గురించి ప్రశ్నించి ప్రముఖ యూట్యూబర్ రణవీర్ అలహాబాదియా వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా గురువారం కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. 'ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశమే కాదు. సామాజిక మాధ్యమాల్లో యూజర్లు జనరేట్ చేస్తోన్న కంటెంట్‌లోని లోపాలు ఎత్తిచూపుతోంది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అనేది ఓ అమూల్యమైన హక్కు. అయితే దాన్ని వక్రీకరించడం సరికాదు' అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. 'ఇది అసలు సమస్య. నేను సొంతంగా ఓ ఛానల్‌ను క్రియేట్ చేశాను. అందువల్ల ఎవరికీ జవాబుదారీగా ఉండను అన్న సంకేతాలు వెళుతున్నాయి. ఇది సరికాదు. ఆన్‌లైన్ కంటెంట్ విషయంలో ఎవరో ఒకరు బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది' అని అభిప్రాయపడ్డారు.

## ఆధార్‌తో పౌరసత్వం రాదు

న్యూఢిల్లీ: పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. "పొరుగు దేశం నుంచి వచ్చిన ఓ కూలీకి రేషన్ కోసం ఆధార్ కార్డు ఇస్తే, అతడిని ఓటరుగా కూడా చేయాలా?" అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. ఎన్నికల సంఘం కేవలం పోస్టాఫీసు కాదని, ఓటరు దరఖాస్తుతో పాటు సమర్పించిన పత్రాల వాస్తవికతను పరిశీలించే అధికారం దానికి ఉందని స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. ఈసీ చేపట్టిన ప్రక్రియ నిరక్షరాస్యులైన సాధారణ ఓటర్లపై రాజ్యాంగ విరుద్ధమైన భారం మోపుతోందని అన్నారు. ఫారాలు నింపడం తెలియని వారిని జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధార్ పౌరసత్వానికి తిరుగులేని రుజువు కాకపోయినా, నివాసానికి సంబంధించి ప్రాథమిక ఆధారంగా పరిగణించాలని వాదించారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు సంబంధించిన పిటిషన్లపై డిసెంబర్ 1లోగా సమాధానం దాఖలు చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

## అభివృద్ధిని ప్రతిబింబించాలి

మొదటి పేజీ తరువాయి

కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం చెప్పారు. వైద్యం, విద్య, టెక్నాలజీ, జీసీసీలు, ఫార్మా, అగ్రికల్చర్‌తో పాటు వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, స్టార్టప్, టూరిజం, ఎగుమతులు వంటి రంగాలు రానున్న రెండు దశాబ్దాల్లో ఆర్థిక వృద్ధికి కీలక రంగాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, సులభతర అనుమతులు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు రాష్ట్రాన్ని పెట్టుబడిదారుల మొదటి గమ్యస్థానంగా నిలబెట్టనున్నాయన్నారు. ఈ బలాలే పునాదిగా మరింత పెట్టుబడులను ఆకర్షించే విధంగా విజన్ డాక్యుమెంట్ ఉండాలని సీఎం సూచించారు. మూసీ పునరుజ్జీవం, హైదరాబాద్‌లో 2,959 చెరువులు, పార్కులు, అటవీ ప్రాంతాలను వాటి పూర్వ స్థితికి తీసుకురావడంతో పాటు.. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన రోడ్లు, సౌర విద్యుత్ వెలుగులతో విలేజ్ 2.0 లక్ష్యంతో పనిచేసేలా ప్రణాళిక చేసినట్లు అధికారులు వివరించారు. రీజినల్ రింగ్ రోడ్డు, హై-స్పీడ్ మొబిలిటీ కారిడార్లు, రీజినల్ రింగ్ రైల్, నాలుగు ఇండస్ట్రియల్ కారిడార్లు, 11 రేడియల్ రోడ్లు, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, పెద్దపల్లి, కొత్తగూడెంలలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటును డాక్యుమెంట్‌లో వివరించనున్నట్లు పేర్కొన్నారు.

## కోర్టు అంటే లెక్కలేదా?

### నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తాం

### హైడ్రా రంగనాథ్‌కు హైకోర్టు వార్నింగ్

హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): తెలంగాణ హైకోర్టుమరోసారి హైడ్రాపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు హైకోర్టు కోర్టు ధిక్కరణ కేసులో కఠిన హెచ్చరిక జారీ చేసింది. బతుకమ్మ కుంట వివాదానికి సంబంధించి హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు డిసెంబర్ 5వ తేదీలోపు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. ఈ వివాదం హైదరాబాద్‌లోని బతుకమ్మ కుంట పరిధిలో కోర్టు వివాదంలో ఉన్న ఒక ప్రైవేట్ స్థలానికి సంబంధించింది. ఆ స్థలంలో ఎలాంటి మార్పులు చేర్పులు చేయరాదని.. యథాతథస్థితి కొనసాగించాలని కోర్టు గతంలో జూన్ 12వ తేదీన స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే.. కోర్టు ఉత్తర్వులను కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఏ. సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. తన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినందుకు ఎందుకు చర్యలు తీసుకోరాదో వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని రంగనాథ్‌కు నోటీసులు జారీ చేసింది. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా రంగనాథ్ హాజరు కాకపోవడంతో హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. డిసెంబర్ 5వ తేదీలోపు ఆయన ప్రత్యక్షంగా కోర్టులో హాజరు కాకపోతే.. నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేయాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించింది. న్యాయస్థానం ఆదేశాలకు అధికారులు తగిన గౌరవం ఇవ్వడం లేదనే భావనను హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఇదే అంశంలో గతంలోనూ హైడ్రా పనితీరుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యంగా తుమ్మిడికుంట పునరుద్ధరణ విషయంలో తమ ఆదేశాలను పాటించడం లేదని కోర్టు ఆగ్రహించింది. హైడ్రాకు వ్యతిరేకంగా కోర్టుకు రోజూ దాదాపు 10 పిటిషన్లు వస్తున్నాయంది. ప్రజలకు మంచి జరిగే పనులు మాత్రమే చేయాలని.. న్యాయస్థానం ఆదేశాలను గౌరవించాలని హైడ్రాను హైకోర్టు ఆదేశించింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు కలిగే నష్టంపై కోర్టు ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది.

# అయ్యప్పలకు డ్రెస్ కోడ్ విముక్తినివ్వాలి!

## తెలంగాణ డీజీపీ ఆఫీస్ ముట్టడిలో స్వాములు

హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): తెలంగాణ డీజీపీ కార్యాలయాన్ని అయ్యప్ప స్వాములు ముట్టడించారు. అయ్యప్ప మాల వేసుకున్న పోలీసులు కూడా యూనిఫాం ధరించాలంటూ ఆంక్షలు విధించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఈ రూల్స్ ఉన్నాయంటూ స్వాములు మండిపడ్డారు. అయ్యప్ప స్వాములకు మద్దతుగా బీజేవైఎం కార్యకర్తలు కూడా డీజీపీ కార్యాలయానికి తరలివచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. అయ్యప్ప మాలతో ఆఫీసుకు రాకూడదంటూ ఇచ్చిన మెమోపై దీక్ష తీసుకున్న పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీజీపీ కార్యాలయానికి వచ్చిన స్వాములు ఆఫీసులోనికి వెళ్లే ప్రయత్నంలో తోపులాట జరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు లాఠీ చార్జ్ చేశారని అయ్యప్ప స్వాములు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వాములు భారీ ర్యాలీతో డీజీపీ కార్యాలయం ముట్టడికి తరలిరావడంతో వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకోవలసి వచ్చింది. దీంతో పోలీసులకు వ్యతిరేకంగా స్వాములు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులతో స్వాములకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో పోలీసులు కొందరు అయ్యప్పలను అరెస్టు చేశారు. అయ్యప్ప దీక్ష ధరించిన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడాన్ని అయ్యప్ప స్వాములు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయ్యప్ప మాలలు వేసుకున్న పోలీసులు యూనిఫామ్ డ్రెస్ కోడ్ లేకుండా డ్యూటీకి రావద్దంటూ ఇటీవల ఆదేశాలు ఇచ్చారు. దీనికి నిరసనగా అయ్యప్పలు ఆందోళనకు దిగారు. అయ్యప్ప దీక్షాధారులకు పోలీస్ డ్రెస్ కోడ్ నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాగా అయ్యప్ప దీక్షాధారులకు యూనిఫారం నిబంధనల్లో వెసులుబాటు ఇవ్వలేమని హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయం నవంబర్ 20న ఒక ఉత్తర్వు జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ, యూనిఫాం నిబంధనల్లో వెసులుబాటు కల్పించాలని కంచన్‌బాగ్ స్టేషన్‌కి చెందిన ఎస్సై ఎస్. కృష్ణకాంత్ వినతి చేశారు. సౌత్ ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ కే శ్రీకాంత్ ఈ అంశంపై స్పందిస్తూ, తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయం ఉత్తర్వుల ప్రకారం డ్రెస్ కోడ్ విషయంలో వెసులుబాటు కల్పించడం కుదరదని తేల్చిచెప్పారు. ఇదే విషయాన్ని ఆయన ఆ జోన్ పరిధిలోని అన్ని స్టేషన్లకూ తెలియజేశారు. దీంతో ఈ అంశంపై వివాదం తలెత్తింది.



# కబ్జా చేయాలని చూస్తున్నారు: హైడ్రా

కూకట్‌పల్లి, నవంబర్ 27 (ఈవార్తలు): కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద బుధవారం తాము ఎలాంటి ఆక్రమణలను తొలగించలేదని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హైడ్రా) స్పష్టం చేసింది. చెరువు భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, పేదల గుడిసెలంటూ తప్పుడు ప్రచారం చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించింది. హైడ్రా అధికారుల కథనం ప్రకారం... చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి వచ్చే సర్వే నంబర్ 176లో చెత్త సేకరించేవారు, స్క్రాప్ వ్యాపారులు తాత్కాలిక షెడ్లు వేసుకున్నారు. చెరువు ప్రాంతాన్ని ఖాళీ చేయాలని వారిని కోరగా, రెండు మూడు రోజుల క్రితమే వారు స్వచ్ఛందంగా తమ షెడ్లను తొలగించుకుని వెళ్లిపోయారు. అయితే, ఈ స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్న కొందరు కబ్జాదారులు.. సర్వే నంబర్ 180 పేరుతో ఇప్పుడు కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చారు. గతంలో ఇక్కడ ఉన్నవారి నుంచి అద్దెలు వసూలు చేసిన వారే, ఇప్పుడు వారిని అడ్డం పెట్టుకుని భూమిని కొట్టేయాలని చూస్తున్నారని హైడ్రా ఆరోపించింది. ఈ వ్యవహారంపై కొందరు హైకోర్టును కూడా ఆశ్రయించి, సర్వే నంబర్ 180 కింద తమకు నష్టపరిహారం కావాలని కోరారు. అయితే, తాము ఖాళీ చేయిస్తున్నది సర్వే నంబర్ 176 అని, చెరువులో చెత్త వేయడం వల్ల నీరు కలుషితమవుతోందని హైడ్రా కోర్టుకు వివరించింది. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. సర్వే నంబర్లను సరిచూసి, నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని సూచించినట్లు అధికారులు తెలిపారు. అసలైన నివాసితులు వెళ్లిపోయిన తర్వాత, కబ్జాదారులు చేస్తున్న చివరి ప్రయత్నమే ఈ గందరగోళమని హైడ్రా స్పష్టం చేసింది.



# తొలిరోజు 3,242 నామినేషన్లు

**మొదలైన పంచాయతీ ఎన్నికల నామినేషన్లు**

హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమయ్యింది. మూడ్రోజులు అంటే నవంబర్ 29 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. 11 తేదీన మొదటి విడత పోలింగ్ జరిగి అదేరోజు ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలువడతాయి. రెండో విడత నామినేషన్లు నవంబర్ 30న ప్రారంభమై డిసెంబర్ 2 వరకు కొనసాగుతాయి. డిసెంబర్ 14న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల విడుదల జరుగుతుంది. మూడో విడత నామినేషన్లు డిసెంబర్ 3న ప్రారంభమై డిసెంబర్ 5 వరకు కొనసాగుతాయి. డిసెంబర్ 17 పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుంది. కాగా, తొలి రోజైన గురువారం నాడు.. సర్పంచి పదవులకు 3,242 నామపత్రాలు దాఖలయ్యాయి. వార్డు సభ్యులకు 1,821 నామినేషన్లు వచ్చాయి. తొలిదశలో 4,236 గ్రామపంచాయతీలు, 37 వేలకుపైగా వార్డుల్లో పోలింగ్ జరగనుంది.

# పల్లెలకు కారు!

**సర్పంచ్ ఎన్నికల తర్వాత కేడర్ బలోపేతం**

**బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం**

**గ్రామస్థాయి నుంచి పార్టీ కమిటీలు**

**జిల్లా కార్యాలయాల్లో శిక్షణ తరగతులు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): సర్పంచ్ ఎన్నికలు అయిన వెంటనే పార్టీని బలోపేతం చేసుకుందామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఎన్నికలు అయిన వెంటనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. అలాగే గ్రామస్థాయి నుంచి పార్టీ కమిటీలు వేసుకుందామని.. క్యాడర్‌ను గట్టిగా చేసుకుందామని చెప్పారు. జిల్లా కార్యాలయాల్లో కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ దెబ్బకు ఒక మంత్రి పదవి వచ్చిందని తెలిపారు. రేవంత్ రెడ్డి కూడా గల్లీగల్లీ కూడా తిరిగి ప్రచారం చేసిండని అన్నారు. చిన్న చిన్న ఎదురుదెబ్బలు తగిలినా భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేకత ఏ ప్రభుత్వానికి లేదని అన్నారు. మన పార్టీ నాయకుల అనైక్యతతోనే ఓడిపోయామని కేటీఆర్ అన్నారు. మనం చేసిన పనులు సరిగ్గా చెప్పుకోలేదని తెలిపారు. సోషల్‌మీడియాలో చెప్పిన అబద్ధాలను ప్రజలు నమ్మారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93వేల కోట్ల ఖర్చు అయ్యిందని.. కానీ రాహుల్ గాంధీ వచ్చి రూ.లక్ష కోట్ల కుంభకోణం అంటే ప్రజలు నమ్మారని అన్నారు. ప్రజలు ఆరు గ్యారంటీల గారడిలో పడి మోసపోయారని తెలిపారు. కల్వకుర్తిలో ఆస్పత్రి లేదని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మాట్లాడుతున్నాడని.. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ బాధ్యుడా అని నిలదీశారు. 420 హామీలను కాంగ్రెస్ నాయకులు తుంగలో తొక్కారని కేటీఆర్ విమర్శించారు. ఇప్పుడు ఏం చేశావని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తే ఫ్రీ బస్సు అంటున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ అంటూ పురుషులకు డబుల్ రేట్లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టేసరికి కేసీఆర్ గుర్తుకొచ్చిండు అని కేటీఆర్ అన్నారు. ఏ ఊళ్లో అయినా పది మంది గుమిగూడితే.. తొందరగా కేసీఆర్‌ను తెచ్చుకోవాలని అనుకుంటున్నారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వ్యాఖ్యానించారు.

# పవన్ తెలివితక్కువోడు

**ఏపీ దిష్టే హైదరాబాద్2కు**

**మెదడులేనోడు డిప్యూటీ సీఎం**

**మాజీమంత్రి జగదీశ్ రెడ్డి ఫైర్**



హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన 'దిష్టి' వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల మధ్య రాజకీయ దుమారం రేపుతున్నాయి. కోనసీమ పచ్చదనానికి తెలంగాణ నేతల దిష్టి తగిలిందన్న పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్‌వి తెలివితక్కువ మాటలని, మెదడుకు పనిచెప్పకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. "మా దిష్టి వాళ్లకు తగలడం కాదు, ఇన్నేళ్లుగా వాళ్ల దిష్టే మా తెలంగాణకు, హైదరాబాద్‌కు తగిలింది" అని జగదీశ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ప్రతిరోజూ వందలాది మంది ఏపీ నుంచే హైదరాబాద్‌కు వస్తున్నారని, అలాంటప్పుడు తమ దిష్టి ఎలా తగులుతుందని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ దిష్టి తగులుతుందని అంత భయంగా ఉంటే, ఓ దిష్టిబొమ్మ పెట్టుకోవాలని, దాన్ని తామేమీ ఆపలేదని వ్యంగ్యంగా అన్నారు. "ఇంత తెలివిలేని వాళ్లు కూడా ఉప ముఖ్యమంత్రులు అవుతున్నారంటే ఆశ్చర్యంగా ఉంది" అంటూ జగదీశ్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం కోనసీమ జిల్లా రాజోలులో 'పల్లె పండుగ 2.0' కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పచ్చని కోనసీమకు తెలంగాణ నాయకుల దిష్టి తగిలింది. ఇక్కడి కొబ్బరి చెట్ల పచ్చదనాన్ని చూసే బహుశా వారికి ప్రత్యేక రాష్ట్రం ఆలోచన వచ్చిందేమో" అని వ్యాఖ్యానించారు. నరుడి దిష్టికి రాయి కూడా పగిలిపోతుందని ఆయన పేర్కొన్నారు. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశం కాగా, జగదీశ్ రెడ్డి తాజా ప్రతిస్పందనతో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ మాటల యుద్ధం రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



# డిస్కంలను ముంచేశారు

**బీఆర్ఎస్‌పై మంత్రి తుమ్మల ఫైర్**

హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): తెలంగాణ డిస్కంలను నట్టేట ముంచిందే గత బీఆర్ఎస్ సర్కార్ అని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆరోపించారు. గత ప్రభుత్వ అడ్డగోలు నిర్ణయాలు, ఛత్తీస్ గఢ్ నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు, అవినీతి కారణంగా డిస్కంలు రూ.90 వేల కోట్ల అప్పుల్లో మునిగాయని చెప్పారు. విద్యుత్ రంగాన్ని భ్రష్టు పట్టించిన నాటి బీఆర్ఎస్ మంత్రులు ఇప్పుడు నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని తుమ్మల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలను గ్రహించిన ప్రజలు ఎన్నికల్లో బీఆర్ఎస్ కు బుద్ధి చెప్పారని తెలిపారు. అయినాసరే బావాబామ్మర్దులు మాత్రం ప్రజలను ఇంకా మభ్య పెట్టాలని చూస్తున్నారని హరీశ్ రావు, కేటీఆర్ లను ఉద్దేశించి విమర్శించారు. తొలుత అసెంబ్లీ ఎన్నికల్లో, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో, ఆపై కంటోన్మెంట్ ఎన్నికల్లో, ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో.. బీఆర్ఎస్ అవినీతిపై ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ప్రజాతీర్పుతో హరీశ్, కేటీఆర్ ల మైండ్ పనిచేయడం లేదని, ఏం మాట్లాడాలో అర్థంగాక విద్యుత్ ప్లాంట్లలో అవినీతి అంటూ నోటికొచ్చిన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మూసీని గోదావరి నీళ్లతో నింపుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటిస్తే.. లక్ష కోట్ల అవినీతి అంటూ కేటీఆర్ ఆరోపిస్తున్నారని, ఇండస్ట్రియల్ జోన్ లోని భూముల కన్వర్షన్ విషయంలో రూ.5 లక్షల కుంభకోణం అని.. నోటికి వచ్చిన లెక్కలతో ఎలాంటి ఆధారం లేకుండా విమర్శిస్తున్నారని మంత్రి తుమ్మల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణల విషయంలో కేటీఆర్ కన్నా తానేమీ తక్కువ కాదని నిరూపించుకునేందుకు హరీశ్ రావు ప్రయత్నిస్తున్నారని తుమ్మల ఎద్దేవా చేశారు. రూ.50 వేల కోట్ల కుంభకోణం జరిగిందంటూ హరీశ్ అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు విమర్శించారు.

# కేటీఆర్‌వి తప్పుడు కూతలు

**రిజర్వేషన్లపై సీతక్క స్ట్రాంగ్ కౌంటర్**



హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను 17 శాతానికి తగ్గించిందన్న కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి సీతక్క స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్ ప్రచారం చేస్తున్నట్లుగా బీసీల రిజర్వేషన్‌లు ఎక్కడా తగ్గలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోసిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని.. కానీ 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి తడిబట్టతో బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్ అంటూ విరుచుకుపడ్డారు. ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. అబద్దాలకు అంబాసిడర్‌గా మారి కేటీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బీసీలు విశ్వసించరని తెలిపారు. గత స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు చేశారని.. కానీ ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందన్నారు. సర్పంచుల రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్రం యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. అందుకోసం ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా చెప్పిందని సుప్రీం తీర్పును మంత్రి గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని సిఫార్సు మేరకు మండలం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్ల నిర్ణయం జరిగిందన్నారు. ఆయా మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాను బట్టి సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయని తెలిపారు. అందుకే కొన్ని మండలాల్లో రిజర్వేషన్లు పెరిగినట్లుగా, మరికొన్ని మండలాల్లో తగ్గినట్లుగా పైకి కనిపిస్తున్నా, స్టేట్ యూనిట్‌గా చూస్తే ఎక్కడా రిజర్వేషన్లు తగ్గలేదని వెల్లడించారు. ఏ మండలంలో కూడా రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. రిజర్వేషన్ల ఖరారులో సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేశామని వివరించారు. సుప్రీం తీర్పును అపహాస్యం చేసినట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కుల గణన చేపట్టి పక్కాగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు. కుల గణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం, బీసీ రిజర్వేషన్లపై సన్నాయి నొక్కులు నొక్కుతోందని వ్యాఖ్యలు చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామని... అందుకోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. అసెంబ్లీలో తీర్మానం చేశామని.. జంతర్ మంతర్‌లో స్వయంగా సీఎం నేతృత్వంలో ధర్నా చేపట్టామని మంత్రి అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, కాంగ్రెస్‌ను విమర్శిస్తూ బీజేపీ బీ టీంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ అమలు చేస్తోందన్నారు. బీసీలకు 42 శాతం సీట్లు బీఆర్ఎస్ ఇస్తుందా లేదా చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్, బీజేపీ.. బీసీ ద్రోహులు

**మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): బీసీ రిజర్వేషన్ అంశంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీసీల కోసం పోరాడేది తాము మాత్రమేనని, ఇతర పార్టీలు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం మొసలి కన్నీళ్లు కారుస్తున్నాయని తీవ్ర విమర్శలు చేశారు.. బీఆర్ఎస్, బీజేపీ. బలహీనవర్గాల ద్రోహులు అని మండిపడ్డారు.. గతంలో ఇతర రాష్ట్రాల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ, ఈ పరిమితిని అధిగమించేందుకు ప్రభుత్వం సేకరించిన డాటా, నివేదికలు ఆధారంగా కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు. అసలు బీఆర్ఎస్ కోర్టులో ఇంప్లీడ్ ఎందుకు కాలేదు? అని పొన్నం ప్రశ్నించారు.. సిగ్గులేకుండా బయట విమర్శలు చేసే బీఆర్ఎస్ నాయకులు కోర్టులో మాత్రం లేరు అని మంత్రి ఆరోపించారు. కోర్టులో రిజర్వేషన్ నిలిపేస్తే బీఆర్ఎస్ నేతలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. అటు.. బీసీ రిజర్వేషన్ల అమలులో అడ్డంకులు తొలగించేందుకు కేంద్రం సహకరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్న నిధులు ఇప్పించేందుకు బీజేపీ నేతలు ప్రయత్నం చేయడం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు 42% రిజర్వేషన్లతోనే జరపాలన్న ఆలోచన ఉందని తెలిపారు పొన్నం.. ఇక బీసీ సర్వేలో పాల్గొనని పార్టీలకు మాట్లాడే నైతిక హక్కు లేదని పొన్నం తీవ్రంగా హెచ్చరించారు. కేంద్రంలో మా ప్రభుత్వం ఉంటే గంటల్లో బీసీ రిజర్వేషన్ అమలు అయ్యేదన్న ఆయన.. మేము కోర్టులో చేస్తున్న పని మీకూ తెలుసు. తెలిసీ మాపై ఆరోపణలు చేయొద్దు. సలహాలు ఇవ్వండి.. తీసుకుంటాం.. కానీ, రాజకీయ పార్టీల ఒత్తిడికి లోనవ్వొద్దు అని సచించారు.. బీజేప బీఆర్ఎస్ బీసీ ద్రోహులు అని మండిపడ్డారు పొన్నం.. బలహీన వర్గాల పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అన్యాయం చేశాయని తీవ్రంగా మండిపడ్డారు. రాజ్యాంగం ఏం చెబుతుందో తెలియకపోతే తెలుసుకోవాలి. గిరిజన ప్రాంతాల్లో వారికి హక్కుగా రిజర్వేషన్ ఇవ్వాలి.. బీసీ సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదం." అని వ్యాఖ్యానించారు.




# చిరంజీవి సంస్థకు విదేశీ విరాళాలు

**అవకాశం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు**

హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ సేవలను మరింత విస్తృతం చేసేందుకు మార్గం సుగమమైంది. ఈ ట్రస్ట్ విదేశాల నుంచి విరాళాలు స్వీకరించేందుకు వీలుగా విదేశీ విరాళాల నియంత్రణ చట్టం కింద కేంద్ర హోంశాఖ గురువారం అనుమతులు మంజూరు చేసింది. ఈ ఆమోదంతో ట్రస్ట్ కార్యకలాపాలు మరింత బలోపేతం కానున్నాయి. 1998లో స్థాపించిన చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్, ముఖ్యంగా చిరంజీవి బ్లడ్ బ్యాంక్ మరియు ఐ బ్యాంక్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మందికి సేవలు అందిస్తోంది. నిరంతర రక్తదాన శిబిరాలు, ఉచిత నేత్ర శస్త్రచికిత్సల ద్వారా ఎంతోమందికి అండగా నిలుస్తోంది. తాజా అనుమతులతో విదేశాల్లోని దాతల నుంచి కూడా విరాళాలు స్వీకరించే అవకాశం లభించింది. దీనివల్ల మరిన్ని ప్రాంతాలకు సేవలను విస్తరించవచ్చని ట్రస్ట్ వర్గాలు భావిస్తున్నాయి. విదేశీ విరాళాలు స్వీకరించాలనుకునే స్వచ్ఛంద సంస్థలు ఎఫ్‌సీఆర్‌ఏ-2010 చట్టం ప్రకారం కేంద్ర హోంశాఖ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఈ నిబంధనల మేరకు చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ చేసుకున్న దరఖాస్తును కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆమోదించారు. ఈ ప్రక్రియ ద్వారా విదేశీ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత ఉంటుందని అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల చిరంజీవి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపు తమ బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింత ఉత్సాహంగా ముందుకు తీసుకెళతామని వారు పేర్కొన్నారు.

# ట్రాఫిక్ డ్యూటీలో రౌడీషీటర్లు

**రాచకొండ పోలీసుల ప్రయోగం**

ఎల్బీనగర్, నవంబర్ 27 (ఈవార్తలు): నేర చరిత్ర ఉన్నవారిలో మార్పు తీసుకువచ్చి, వారిని సమాజ సేవలో భాగస్వాములను చేసేందుకు రాచకొండ పోలీసులు ఓ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. నిరంతరం నిఘా నీడలో ఉండే రౌడీషీటర్లతో ఇప్పుడు ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 60 మంది రౌడీషీటర్లు ట్రాఫిక్ విధుల్లో పాల్గొన్నారు. ఉప్పల్, ఎల్బీనగర్, కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కో చోట 20 మంది చొప్పున వీరిని ఎంపిక చేశారు. వీరు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. గత కొంతకాలంగా ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, మంచి ప్రవర్తనతో ఉంటున్న వారిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగిస్తున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ, రౌడీషీటర్లలో మార్పు తీసుకురావడం ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వారు నేరాలకు దూరంగా ఉంటూ మంచి జీవితం గడిపే అవకాశం ఉంటుందని అన్నారు. రానున్న రోజుల్లో మరింత మందిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తామని వివరించారు. ఈ ప్రయోగం ద్వారా నేరస్తులను సంస్కరించి, తిరిగి సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపేలా చేయాలని పోలీసులు ఆశిస్తున్నారు.

# సిట్ విచారణకు కేసీఆర్ మాజీ ఓఎస్‌డీ

హైదరాబాద్, నవంబర్ 27 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు మళ్లీ వేగం పుంజుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత సహాయకుడిగా (ఓఎస్‌డీ) పనిచేసిన రాజశేఖర్ రెడ్డిని ప్రశ్నించింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ విచారణలో అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నూతన పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన రాజశేఖర్ రెడ్డిని సిట్ విచారణకు పిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. ఈ కేసులో ఇప్పటికే పలువురు పోలీసు అధికారులను సస్పెండ్ చేయగా, కీలక నిందితుడిగా ఉన్న మాజీ అధికారి రాధాకిషన్ రావును అరెస్టు చేశారు.



## స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించండి: వాసాల

మల్యాల, నవంబర్ 27 (ఈవార్తలు): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నేత వాసాల రమేశ్ కోరారు. గురువారం జగిత్యాల జిల్లా మల్యాల మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను బీజేపీ అమలుచేస్తోందని తెలిపారు. బండి సంజయ్ సొంతంగా విద్యార్థులకు సైకిళ్లు, ఆస్పత్రులకు పరికరాలు, రోడ్ల నిర్మాణాలు చేపడుతూ అభివృద్ధికి పాటుపడుతున్నారని వెల్లడించారు. పంచాయతీల్లో బీజేపీకి చెందినవాళ్లను ఏకగ్రీవంగా గెలిపిస్తే రూ.10 లక్షలు తన ఫండ్ నుంచి ఇస్తానని చెప్పినట్లు గుర్తుచేశారు. బీజేపీ బలపర్చిన అభ్యర్థులు కేంద్రం నుంచి నిధులు తెచ్చి గ్రామాల అభివృద్ధికి పాటుపడతారని వివరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం, మాజీ ఎంపీటీసీ రాచర్ల రమేశ్, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, బొట్ల ప్రసాద్, గడ్డం నడిపి మల్లేశం, కోను శ్రీనివాస్, గుగ్గిల గంగరాజు, నక్క ఆనందం, పొన్నగంటి గౌతం, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు



## సిరిసిల్ల జిల్లా సరిహద్దుల్లో 6 చెక్‌పోస్టులు

**నిరంతరం గస్తీ కాయాలి: ఎస్పీ మహేశ్ బీ గీతే**

సిరిసిల్ల, నవంబర్ 27 (ఈవార్తలు): గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దులో 6 చెక్ పోస్టులనుఏర్పాటు చేసినట్లు ఆ జిల్లా ఎస్పీ మహేశ్ బీ గీతే తెలిపారు. తంగళ్లపల్లి(జిల్లెళ్ల), గంభీరావుపేట్ (పెద్దమ్మ), ముస్తాబాద్ (వెంకట్రావ్ పల్లి), వేములవాడ రూరల్ (ఫాజుల్‌నగర్), బోయిన్‌పల్లి (నర్సింగపూర్), రుద్రంగి (మనాల క్రాస్ రోడ్)లో వీటిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మద్యం, డబ్బు, ఇతర అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలపలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గురువారం బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సింగపూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను ఆకస్మిక తనిఖీ చేసి చెక్ పోస్ట్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి మద్యం, డబ్బు సరఫరా కాకుండా జిల్లాలో సరిహద్దుల్లో చెక్ పోస్టలు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా పెట్టామని తెలిపారు. నగదుకు సంబంధించిన తగిన ఆధారాలు, ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవడం ఉత్తమమని సూచించారు. ఎస్పీ వెంట వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

## అక్రమ ఇసుక టిప్పర్ల పట్టివేత

**6 టిప్పర్లు సీజ్: ధర్మపురి తాసిల్దార్**

ధర్మపురి, నవంబర్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం శివారులో గల మగ్గిడి ఆరెపల్లి గ్రామాల నుండి గోదావరిలోని ఇసుకను అక్రమంగా 27.11.2025 అర్ధరాత్రి ఇంచుమించు 2 గంటల ప్రాంతంలో అణాధికారంగా తరలిస్తున్న ఆరు టిప్పర్లను పట్టుకొన్నట్లు ధర్మపురి మండల తాహసిల్దార్ తెలిపారు. ఆ టిప్పర్లను ధర్మపురి పోలీస్ స్టేషన్‌కు తరలించగా ఆర్ఐ ఫిర్యాదు మేరకు సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్సై మహేష్ తెలిపారు.

## అనారోగ్యంతో మహిళ సూసైడ్

జగిత్యాల, నవంబర్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కండ్లపల్లి గ్రామానికి చెందిన బాలే మల్లేశ్వరి (38) అనారోగ్యంతో బలవన్మరణానికి పాల్పడింది. గత కొద్ది కాలం నుంచి థైరాయిడ్, నోటికి సంబంధించిన సమస్యలతో బాధపడుతోంది. నిత్యం టాబ్లెట్లతోనే కాలం వెళ్లదీస్తోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో, గురువారం సాయంత్రం 4:30 గంటలకు తన ఇంట్లోని ఇనుప పైపుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త బాలె గంగాధర్ ఫిర్యాదుతో జగిత్యాల రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



## భీమన్న గుడిలో అదనంగా ఎస్పీఎఫ్ సిబ్బంది

వేములవాడ, నవంబర్ 27 (ఈవార్తలు): వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి భద్రతా పరంగా ఎస్పీఎఫ్ సిబ్బందిని అదనంగా నియమించారు. ఇందులో హెడ్ కానిస్టేబుళ్లు ఇద్దరు, 10 మంది కానిస్టేబుళ్లు స్వామివారి సేవలోకి చేరారు. కొత్తగా నియమితులైన ఎస్పీఎఫ్ సిబ్బంది.. గురువారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, ఆయుధ పూజ నిర్వహించారు. వీరికి మండపంలో ఆలయ అర్చకులు వేదపారాయణం చేస్తూ ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఈవో రమాదేవి సిబ్బందికి శేషవస్త్రం కప్పి, లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ కమాండెంట్ సీ జంగయ్య, ఏఎస్ఐ డీ తిరుపతిరెడ్డి, సీహెచ్ మహేందర్, ఆలయ పర్యవేక్షకులు రాజేందర్, గొట్టం గిరి పాల్గొన్నారు.



## శ్రీవారి విషయంలో తప్పు చేయలేదు

**పాలీగ్రాఫ్ టెస్టుకు సిద్ధం: వైవీ సుబ్బారెడ్డి**

న్యూఢిల్లీ, నవంబర్ 27 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం నెయ్యి కొనుగోలు వ్యవహారంపై జరుగుతున్న వివాదంపై టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. ఈ విషయంలో తనపై వస్తున్న ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని, అవసరమైతే పాలీగ్రాఫ్ పరీక్షకు కూడా సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, సిట్ దర్యాప్తును కేవలం 2019-24 మధ్య కాలానికే ఎందుకు పరిమితం చేస్తున్నారని ప్రశ్నించారు. అంతకుముందు జరిగిన కొనుగోళ్లపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తాను టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఆలయ ప్రతిష్ఠను పెంచేందుకే పనిచేశానని, దేవుడి విషయంలో ఎలాంటి తప్పు చేయలేదని సుబ్బారెడ్డి అన్నారు. తనపై విషప్రచారం చేస్తున్నారని, ఈ వివాదాన్ని పూర్తిగా రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో సీఎం చంద్రబాబు లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ఆరోపణలు చేసినప్పుడు తాను సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని గుర్తుచేశారు. తాను తప్పు చేసి ఉంటే న్యాయస్థానానికి ఎందుకు వెళ్తానని ప్రశ్నించారు. సిట్ దర్యాప్తు జరుగుతున్న సమయంలోనే కల్తీ నెయ్యితో లడ్డూలు తయారుచేశారని మీడియాలో కథనాలు రావడం దురదృష్టకరమని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. నెయ్యి ట్యాంకర్లను క్షుణ్ణంగా పరిశీలించి, ల్యాబ్ టెస్టుల తర్వాతే వినియోగించామని వివరించారు. ఈ విషయంలో మీడియా సంయమనం శ్రీనివాస సేతు నిర్మాణంలో ప్రజాధనాన్ని ఆదా చేశామని, తిరుమలలో ప్లాస్టిక్‌ను నిషేధించామని తన హయాంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన గుర్తుచేశారు.

## టీటీడీ జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం అరెస్ట్

నెల్లూరు, నవంబర్ 27 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కొనుగోలు విభాగం జనరల్ మేనేజర్ (జీఎం) కె. సుబ్రహ్మణ్యంను గురువారం అరెస్ట్ చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు కాంట్రాక్టర్లు, వ్యాపారులు అరెస్ట్ కాగా, టీటీడీకి చెందిన ఓ ఉన్నతాధికారిని అదుపులోకి తీసుకోవడం ఇదే తొలిసారి. ఈ అరెస్టుతో కేసులో మొత్తం నిందితుల సంఖ్య 10కి చేరింది.

# ర్యాగింగ్ చట్ట రీత్యా నేరం


**భవిష్యత్తు నాశనం అవుతుంది.. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**




జగిత్యాల, నవంబర్ 27 (ఈవార్తలు): గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, ఉత్తమ డాక్టర్లుగా ఎదిగి జిల్లా వైద్య కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సును పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ హాజరై విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ వంటి చట్టవిరుద్ధ చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడకూడదని, అలాంటి ఘటనలు జరిగితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్నేహపూర్వక వాతావరణంలో చదువుకోవాలని, సీనియర్లు జూనియర్ల ను ప్రోత్సహించి మార్గనిర్దేశనం చేయాలని, భయపెట్టడం వంటి చర్యలు చేయకూదని అన్నారు. ర్యాగింగ్ వల్ల బాధితుల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందని, గతంలో ర్యాగింగ్ కారణంగా అనేక మంది విద్యార్థులు తమ భవిష్యత్తును కోలా యిన సంఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. ర్యాగింగ్ నిరోధక చట్టం ప్రకారం ర్యాగింగ్ లో పాల్గొనే విద్యార్థులపై క్రిమినల్ కేసులు, జైలు శిక్ష, కాలేజీ నుండి బహిష్కరణ, స్కాలర్షిప్ రద్దు, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాల కోల్పోవడం వంటి తీవ్ర శిక్షలు ఉంటాయని ఎస్పీ వివరించారు. కళాశాల ప్రాంగణం సురక్షితంగా ఉండేందుకు ప్రతి విద్యార్థి సహకరించాలని, ర్యాగింగ్ ను పూర్తిగా నిర్మూలించేందుకు అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్ బాధితులుగా మారితే 100 నంబరక్కు లేదా సమీప పోలీస్ స్టేషనక్కు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా కళాశాలలో యాంటీ -ర్యాగింగ్ కమిటీలను బలపరచాలని అధ్యాపకులకు సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తాయని, ఇటు వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం అందించినా పోలీస్ శాఖ వెంటనే చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం ఎస్పీ అశోక్ కుమార్ యాంటీ ర్యాగింగ్ పోస్టర్లను ఆవిష్కరించి, విద్యార్థులతో యాంటీ-ర్యాగింగ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, కళాశాల ప్రిన్సిపల్ సునీల్ కుమార్, హెచ్ఓడి కాద్రి, అధ్యాపకులు, 200 నుంది విద్యార్థులు పాల్గొన్నారు.

# అమరావతిని విస్తరించాల్సిందే

**హైదరాబాద్‌లా ఎదగాలి:చంద్రబాబు**



అమరావతి, నవంబర్ 27 (ఈవార్తలు): ఏపీ రాజధాని అమరావతిని హైదరాబాద్ స్థాయి మహానగరంగా తీర్చిదిద్దాలంటే కేవలం 29 గ్రామాల పరిధి సరిపోదని, నగరాన్ని మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పరిధిని పెంచకపోతే అమరావతి ఒక సాధారణ మున్సిపాలిటీగానే మిగిలిపోయే ప్రమాదం ఉందని, ఈ బృహత్ ప్రణాళికకు రైతుల పూర్తి సహకారం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతుల పట్ల తనకు ఎనలేని గౌరవం, కృతజ్ఞత ఉన్నాయని ఆయన పునరుద్ఘాటించారు. గురువారం సచివాలయంలోని ఐదో బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్‌లో ముఖ్యమంత్రి సుమారు 80 మంది రాజధాని రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అమరావతి పర్యటన నేపథ్యంలో, క్యాపిటల్ గెయిన్స్ పన్ను మినహాయింపును మరో రెండేళ్లపాటు పొడిగించేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని రైతులు సీఎంకు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చంద్రబాబు, రైతుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఇప్పటికే ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర (నారాయణ), ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఇప్పటికే మూడుసార్లు సమావేశమై కీలక అంశాలపై చర్చించినట్లు సీఎం వివరించారు. ఈ సమావేశంలో భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, అసైన్డ్ భూముల సమస్యలు, ఇతర పెండింగ్ అంశాలపై విస్తృతంగా చర్చించారు. పరిష్కరించగల ప్రతీ సమస్యకు త్వరలోనే ముగింపు పలుకుతామని, ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని చంద్రబాబు వారికి భరోసా ఇచ్చారు. కొందరు కావాలనే సోషల్ మీడియా ద్వారా అమరావతిపై దుష్ప్రచారం చేస్తున్నారని రైతులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, అలాంటి అసత్య ప్రచారాలను కట్టడి చేసి, రాజధాని నిర్మాణానికి అడ్డంకులను తొలగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమం, రాజధాని ప్రాంత అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని చంద్రబాబు అన్నారు. రైతుల సహకారంతోనే అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశం అనంతరం, రైతులు ప్రభుత్వ స్పందనపై హర్షం వ్యక్తం చేశారు. కాగా, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అమరావతి పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నివాసంలో విందుకు హాజరయ్యారు.



## బ్రూస్‌లీ సేవలు చిరస్మరణీయం

నాగర్ కర్నూల్ నవంబర్ 27 ( ఈ వార్తలు): ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ కరాటే యోధుడు బ్రూస్ లీ సేవలు చిరస్మరణీయమని బ్లాక్ బెల్ట్ డాన్-2 మాస్టర్, కోచ్ ముఖేష్ అన్నారు. మార్షల్ ఆర్టిస్ట్, నటుడు, నిర్మాత, తత్వవేత్త అయిన బ్రూస్లీ 85 వ జన్మదిన వేడుకలనునాగర్ కర్నూల్ జిల్లా బల్మూర్ లోని ముఖేష్ కరాటే అకాడమీలో శిక్షకుడు ముఖేష్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలలో భాగంగా ముందుగా బ్రూస్ లీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు.కరాటే విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్బంగా కోచ్ ముఖేష్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ కు ప్రపంచ ఖ్యాతి రావడానికి బ్రూస్ లీ పాత్రను వివరించారు. బ్రూస్ లీ చిన్నతనం నుంచే యుద్ధ విద్యలపై సాధన చేశాడన్నారు. ఇతను తాను ఆచరించిన నిరాయుధ పోరాటం, ఆత్మ రక్షణ పద్ధతులతో ఆచరణ యోగ్యమైన మార్షల్ ఆర్ట్స్ తత్వాన్ని కనిపెట్టారని అన్నారు. రహస్య పాఠశాలల నుండి మార్షల్ ఆర్ట్స్ ను బయటకు తీసి అందరికీ అందించడానికి బ్రూస్ లీ చురుకుగా పోరాడాడని పేర్కొన్నారు. జాతీ, వయసు, లింగం సంబంధం లేకుండా బహిరంగంగా బోధించి మార్షల్ ఆర్ట్స్ లో అన్ని రంగాలవారు చేరికకు మార్గదర్శకంగా నిలిచారన్నారు. బ్రూస్ లీ 34 ఏళ్లకే తనువు చాలించినప్పటికీ మార్షల్ ఆర్ట్స్ చిరస్థాయిగా తన పేరు సజీవంగా ఉండేలా ఆయన పలు మార్గదర్శకాలు చూపారన్నారు. యువ క్రీడాకారులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆత్మ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు.



## టీచింగ్ డైరీ ప్రకారమే విద్యాబోధన

నాగర్ కర్నూల్ నవంబర్ 27 (ఈ వార్తలు) : ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు టీచింగ్ డైరీ ప్రకారం విద్యా బోధన చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. గురువారం లింగాల మండలం అంబడిపల్లి ప్రాథమిక పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల విద్యా బోధన తీరు, పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ఫేస్ రికగ్నిషన్ పై దృష్టి పెట్టాలని, విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

## బంగాళాఖాతంలో 'దిట్వా' తుపాను

వైజాగ్, నవంబర్ 27 (ఈవార్తలు): నైరుతి బంగాళాఖాతంలో, శ్రీలంక తీరానికి సమీపంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థ గురువారం తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఇది గురువారం సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ తుపానుకు 'దిట్వా' అని నామకరణం చేశారు. ప్రపంచ వాతావరణ సంస్థ సభ్య దేశాల జాబితా ప్రకారం యెమెన్ దేశం ఈ పేరును సూచించింది. యెమెన్‌కు చెందిన సోకోత్రా ద్వీపంలో 'దిట్వా లగూన్' అనే పేరుతో ఒక చాలా ప్రసిద్ధమైన, అందమైన ఉప్పునీటి సరస్సు ఉంది. ఇప్పుడు ఆ ప్రదేశం పేరునే, బంగాళాఖాతంలో ఏర్పడే తుపానుకు పెట్టారు. ప్రస్తుతం సముద్రంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వ్యవస్థ మరింత బలపడి తీరం వైపు కదులుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.


## అమరావతిని దేవతర రాజధాని చేస్తా

**ఏపీ సీఎం చంద్రబాబునాయుడు**

అమరావతి, నవంబర్ 27 (ఈవార్తలు): ఏపీ రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ విస్తరణ పనులకు సీఎం చంద్రబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, పలువురు ఎమ్మెల్యేలు, రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం రూ.260 కోట్ల అంచనా వ్యయంతో రెండు దశల్లో ఈ పనులను చేపట్టనున్నారు. తొలి దశలో రూ.140 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం, ఏడంతస్తుల మహారాజగోపురం, వివిధ మండపాలు, పుష్కరిణి వంటివి నిర్మించనున్నారు. రెండో దశలో రూ.120 కోట్లతో మాడ వీధులు, అన్నదాన సత్రం, యాత్రికుల వసతి సముదాయాలు, పరిపాలన భవనం వంటివి నిర్మిస్తారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... దేవతల రాజధాని స్ఫూర్తితో మన అమరావతిని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. "రాజధాని కోసం 33 వేల ఎకరాలు త్యాగం చేసిన ఈ ప్రాంత రైతులకు నా ధన్యవాదాలు. అమరావతిపై ఎవరికీ ఎలాంటి అనుమానం అవసరం లేదు" అని ఆయన అన్నారు. తిరుమల వేంకటేశ్వరుడు తమ ఇలవేల్పని, అలిపిరి దాడి నుంచి ఆయనే తనకు ప్రాణభిక్ష పెట్టారని గుర్తుచేసుకున్నారు. గత ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టి విధ్వంసం సృష్టించిందని విమర్శించారు. ఈ పవిత్ర ఆలయ నిర్మాణాన్ని రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని టీటీడీ అధికారులను ఆదేశించారు.

## పట్టుబడ్డ డిజిటల్ అరెస్ట్ ముఠా

భీమవరం, నవంబర్ 27 (ఈవార్తలు): 'డిజిటల్ అరెస్ట్' పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ సైబర్ ముఠా గుట్టును ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పోలీసులు రట్టు చేశారు. సీబీఐ అధికారులమని చెప్పి ఓ విశ్రాంత ప్రొఫెసర్‌ను బెదిరించి, ఆయన ఖాతా నుంచి రూ.78 లక్షలు కాజేసిన కేసులో 13 మందిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన ముంబైకి చెందిన రహతే జె నయన్ పరారీలో ఉన్నాడు. వివరాల్లోకి వెళితే, విశ్రాంత ప్రొఫెసర్ శర్మకు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు, తాము సీబీఐ అధికారులమని పరిచయం చేసుకున్నారు. ఆయన సిమ్ కార్డుతో అక్రమాలు జరిగాయని, ఈ కేసులో మిమ్మల్ని 'డిజిటల్ అరెస్ట్' చేస్తున్నామని నమ్మించారు. బెంగళూరు నుంచి వచ్చిన ఈ ఫోన్ కాల్‌తో మొదలైన మోసం 13 రోజుల పాటు కొనసాగింది. బాధితుడి నుంచి ఆధార్, బ్యాంకు వివరాలు సేకరించి, విడతలవారీగా మొత్తం రూ.78 లక్షలు దోచుకున్నారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఈ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ కేసును సవాలుగా స్వీకరించిన భీమవరం పోలీసులు ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ గాలింపు చర్యలు చేపట్టి 13 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో కొందరు టెక్నాలజీ నిపుణులు కాగా, ఏడుగురు గతంలో కంబోడియాలో పనిచేసిన అనుభవం ఉన్నవారు. వీరి నుంచి రూ.42 లక్షల నగదును రికవరీ చేయడంతో పాటు, వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న మరో రూ.19 లక్షలను ఫ్రీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ, 'డిజిటల్ అరెస్ట్' అనేది పూర్తిగా బూటకమని, ప్రజలు ఎవరూ ఇలాంటి మాటలు నమ్మవద్దని సూచించారు. ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగులు, ఒంటరిగా ఉండే వారిని లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా మోసాలకు పాల్పడుతోందని తెలిపారు. అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




# ఇమ్రాన్ బతికే ఉన్నారు: జైలు అధికారులు

రావల్పిండి: పాకిస్థాన్ మాజీ ప్రధాని, పీటీఐ పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ జైల్లో మరణించారంటూ సోషల్ మీడియాలో వ్యాపించిన వదంతులపై రావల్పిండిలోని అడియాలా జైలు అధికారులు స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని గురువారం స్పష్టం చేశారు. ఆయన్ను జైలు నుంచి ఎక్కడికీ తరలించలేదని, ప్రస్తుతం తమ వద్దే ఉన్నారని తెలిపారు. జైలు అధికారులు విడుదల చేసిన ప్రకటనలో, "ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలు నుంచి తరలించారనే కథనాల్లో వాస్తవం లేదు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు, అవసరమైన పూర్తి వైద్య సంరక్షణ అందిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యంపై వస్తున్న పుకార్లను నిరాధారమైనవని కొట్టిపారేశారు. ఈ వదంతులపై ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ (పీటీఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని, ఇమ్రాన్‌తో ఆయన కుటుంబ సభ్యుల భేటీని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. గత కొన్ని వారాలుగా ఇమ్రాన్ సోదరీమణులను ఆయన్ను కలిసేందుకు అనుమతించకపోవడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. తమ సోదరుడిని కలిసేందుకు అనుమతించకపోవడంతో ఇమ్రాన్ సోదరీమణులు అలీమా ఖాన్, నూరీన్ ఖాన్, ఉజ్మా ఖాన్ మంగళవారం అడియాలా జైలు బయట గంటల తరబడి నిరసన చేపట్టారు. "లోపల ఏం జరుగుతోందో ఎవరికి తెలుసు? బహుశా ఇమ్రాన్‌ను వేరే చోటుకు తరలించి ఉండవచ్చు. అందుకే మమ్మల్ని కలవనివ్వడం లేదు" అని అలీమా ఖాన్ అనుమానం వ్యక్తం చేశారు. దేశంలో అరాచక పాలన నడుస్తోందని ఆమె విమర్శించారు. 2022లో అవిశ్వాస తీర్మానంతో అధికారం కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్, అవినీతి, ఉగ్రవాదం వంటి పలు కేసుల్లో 2023 ఆగస్టు నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే.

## పుజారా బావమరిది సూసైడ్

**రాజ్‌కోట్‌లోని నివాసంలో బలవన్మరణం**

రాజ్‌కోట్: టీమిండియా మాజీ టెస్ట్ క్రికెటర్ చెతేశ్వర్ పుజారా కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఆయన బావమరిది జీత్ రసిక్‌భాయ్ పబారి రాజ్‌కోట్‌లోని తన నివాసంలో ఆత్మహత్య చేసుకున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం బుధవారం (నవంబర్ 26) ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న మాల్వియానగర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జీత్‌ను సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మృతికి గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయని అధికారులు తెలిపారు. కాగా, సరిగ్గా ఏడాది క్రితం 2024లో జీత్ మాజీ ప్రియురాలు ఆయనపై అత్యాచారం కేసు పెట్టారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని, నిశ్చితార్థం తర్వాత కూడా వేధింపులు కొనసాగించి, ఆపై సంబంధాన్ని అకస్మాత్తుగా రద్దు చేసుకున్నాడని ఆమె తన ఫిర్యాదులో ఆరోపించింది. కేసు నమోదైన తేదీనే జీత్ ఆత్మహత్య చేసుకోవడంతో, ఆ కేసుకు సంబంధించిన తీవ్రమైన ఒత్తిడి కారణంగానే ఆయన ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పుజారా 2013లో జీత్ సోదరి పూజా పబారిని వివాహం చేసుకున్నారు.




## గంభీర్ సేఫ్.. బీసీసీఐ మద్దతు

న్యూఢిల్లీ: టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను పదవి నుంచి తొలగిస్తారంటూ వస్తున్న ఊహాగానాలకు బీసీసీఐ వర్గాలు తెరదించాయి. దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌ను 0-2 తేడాతో కోల్పోయిన నేపథ్యంలో గంభీర్‌పై వేటు వేస్తారనే ప్రచారం జరిగింది. అయితే, ప్రస్తుతానికి అలాంటి ఆలోచనేదీ లేదని, అతనికి పూర్తి మద్దతుగా నిలుస్తామని బోర్డు వర్గాలు స్పష్టం చేశాయి. ఈ మేరకు ఎన్డీటీవీ తన కథనంలో పేర్కొంది. గత ఏడాది కాలంలో భారత జట్టు స్వదేశంలో టెస్టు సిరీస్ ఓడిపోవడం ఇది రెండోసారి కావడంతో గంభీర్ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. అతని స్థానంలో వీవీఎస్ లక్ష్మణ్‌కు రెడ్-బాల్ కోచ్‌గా బాధ్యతలు అప్పగించవచ్చని కూడా వార్తలు వచ్చాయి. అయితే, ఈ వాదనలను బీసీసీఐ వర్గాలు తోసిపుచ్చాయి. "గంభీర్‌ను మార్చే ఆలోచన ప్రస్తుతానికి లేదు. అతను జట్టును పునర్నిర్మిస్తున్నాడు. అతని కాంట్రాక్ట్ 2027 ప్రపంచకప్ వరకు ఉంది" అని ఆ వర్గాలు ఎన్డీటీవీకి తెలిపాయి. దక్షిణాఫ్రికాతో పరిమిత ఓవర్ల సిరీస్ ముగిసిన తర్వాత టీమ్ మేనేజ్‌మెంట్, సెలెక్టర్లతో ఒక సమావేశం ఉంటుందని కూడా ఆ వర్గాలు వెల్లడించాయి. "జట్టు పరివర్తన దశలో ఉన్నప్పుడు టెస్టు ప్రదర్శనను ఎలా మెరుగుపరచాలనే దానిపై ఆ సమావేశంలో గంభీర్‌తో చర్చిస్తాం" అని వారు వివరించారు. ఈ ప్రకటనతో గంభీర్ పదవికి వచ్చిన ముప్పేమీ లేదని స్పష్టమైంది.

# మనోళ్లు ప్రపంచానికి ఆదర్శనం

**యువత వల్లే స్టార్టప్ విప్లవం సాధ్యమైంది.. అంతరిక్ష రంగంలో 300కు పైగా స్టార్టప్‌ల ఏర్పాటు**

- 1.5 లక్షల స్టార్టప్‌లతో మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- యాప్‌ల నుంచి డీప్-టెక్ వైపు యువత అడుగులు
- ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు




న్యూఢిల్లీ: భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-వన్'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు. దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు. గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్-టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# 'ఈజీఇన్వెస్ట్'తో జాగ్రత్త

**ఇన్వెస్టర్లను హెచ్చరించిన బీఎస్ఈ**



ముంబై: బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) గురువారం స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు కీలక హెచ్చరిక జారీ చేసింది. 'ఈజీఇన్వెస్ట్' అనే అనధికారిక సంస్థ కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ సంస్థ ఎలాంటి అనుమతులు లేకుండానే పెట్టుబడి, ట్రేడింగ్ సలహాలు ఇస్తూ ప్రజల నుంచి నిధులు సేకరిస్తోందని బీఎస్ఈ తన సర్క్యులర్‌లో పేర్కొంది. ఈజీఇన్వెస్ట్ సంస్థకు సెబీ వద్ద గానీ, తమ ఎక్స్ఛేంజ్‌లో గానీ ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదని బీఎస్ఈ స్పష్టం చేసింది. అందువల్ల, పెట్టుబడిదారులు ఏవైనా సలహాలు పాటించే ముందు, సంబంధిత సలహాదారుల గుర్తింపు, రిజిస్ట్రేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని కోరింది. ఎక్స్ఛేంజ్‌లో రిజిస్టర్ అయిన మధ్యవర్తుల వివరాలను తమ అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపింది. స్టాక్ మార్కెట్‌లో గ్యారెంటీ లేదా హామీతో కూడిన రాబడి ఇస్తామని చెప్పే ఏ పథకాన్ని నమ్మవద్దని బీఎస్ఈ తేల్చిచెప్పింది. చట్టప్రకారం అలాంటి హామీలు ఇవ్వడం నిషేధమని గుర్తు చేసింది. గత నెలలో కూడా బీఎస్ఈ ఇలాంటి హెచ్చరికే జారీ చేసింది. కొందరు కేటుగాళ్లు బీఎస్ఈ ఉన్నతాధికారుల ఫోటోలను ఉపయోగించి నకిలీ సోషల్ మీడియా ఐడీలు సృష్టించి, వెల్త్ అడ్వైజరీ పేరుతో ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టిస్తున్నారని అప్పట్లో వెల్లడించింది. బీఎస్ఈ అధికారులు ఎలాంటి వెల్త్ మేనేజ్‌మెంట్ సేవలు అందించరని, ఇలాంటి నకిలీ ప్రచారాలను నమ్మవద్దని మరోసారి స్పష్టం చేసింది. ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు సమాచార ప్రామాణికతను సరిచూసుకోవాలని ఇన్వెస్టర్లకు సూచించింది.




## స్టాక్ మార్కెట్ కొత్త రికార్డులు


దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం సరికొత్త రికార్డులు సృష్టించాయి. ట్రేడింగ్ సమయంలో చారిత్రాత్మక గరిష్ఠాలను తాకినప్పటికీ, చివరికి స్వల్ప లాభాలతో ఫ్లాట్‌గా ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 110.87 పాయింట్లు లాభపడి 85,720.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10.25 పాయింట్ల స్వల్ప లాభంతో 26,215.55 వద్ద నిలిచింది. రోజువారీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 86,055.86 వద్ద, నిఫ్టీ 26,310.45 వద్ద ఆల్-టైమ్ హై స్థాయిలను నమోదు చేశాయి. ఇది ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపింది. సాంకేతికంగా నిఫ్టీకి 26,300 కీలక నిరోధకంగా ఉందని, దీనిని దాటితే 26,350%-%26,450 స్థాయిలకు చేరే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, 26,150%-%26,000 మధ్య బలమైన మద్దతు లభిస్తోందని తెలిపారు. బ్రాడర్ మార్కెట్లలో మిశ్రమ స్పందన కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.08 శాతం లాభపడగా, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.53 శాతం నష్టపోయింది. రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల్లో కొనుగోళ్ల మద్దతు లభించింది. అయితే, ఆటో, మెటల్, ఎనర్జీ, రియల్టీ వంటి రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ కంపెనీలలో బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్ ప్రధానంగా లాభపడ్డాయి. శుక్రవారం వెలువడనున్న జీడీపీ గణాంకాలు, అమెరికా-భారత్ ఒప్పందం, రాబోయే ఆర్‌బీఐ పాలసీ సమావేశం వంటి కీలక అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారు. మార్కెట్ తదుపరి దిశను ఈ పరిణామాలు నిర్దేశిస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

## ఉద్యోగాలు పోయేలా చేయొద్దు ప్లీజ్

**టెక్ దిగ్గజాలకు ఏఆర్ రెహమాన్ సూచన**



చెన్నై: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్, పర్ ప్లెక్సిటీ ఏఐ సీఈఓ అరవింద్ శ్రీనివాస్ వంటి టెక్ దిగ్గజాలకు తాను ఇచ్చిన మొదటి సలహాను వెల్లడించారు. "ప్రజలు ఉద్యోగాలు కోల్పోయేలా చేయొద్దు" అని వారికి సూచించినట్టు తెలిపారు. జెరోధా సహ-వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ పాడ్‌కాస్ట్‌లో ఆయన ఈ విషయాలను పంచుకున్నారు. ఏఐ టెక్నాలజీని ఒక 'బజూకా'తో పోల్చిన రెహమాన్, దాని వాడకంపై కచ్చితమైన నియంత్రణ ఉండాలని అభిప్రాయపడ్డారు. "బజూకాను కొన్నప్పుడు కొన్ని నిబంధనలు ఉంటాయి కదా? అది ప్రమాదకరం కాబట్టి అందరికీ ఇవ్వరు. ఏఐ కూడా అలాంటిదే. నియంత్రణ లేకపోతే ఇది ప్రజల ఉద్యోగాలను లాగేసుకుని, కుటుంబాలను పేదరికంలోకి నెట్టేస్తుంది. అందుకే ట్రాఫిక్, ఇమ్మిగ్రేషన్ నియమాల్లాగే ఏఐకి కూడా మానవులు నియమాలు రూపొందించాలి" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఏఐని తాను ఒక 'సమానత్వకర్త'గా కూడా చూస్తున్నానని రెహమాన్ తెలిపారు. వనరులు లేని యువ కళాకారులకు, కలలు కనేవారికి ఏఐ అండగా నిలుస్తుందని, కానీ అదే సమయంలో నియంత్రణ లేకపోతే ప్రస్తుతం పనిచేస్తున్న సంగీతకారులకు నష్టం చేస్తుందని హెచ్చరించారు. పేదరికం, తప్పుడు సమాచారం వంటి తరతరాల సమస్యలను పరిష్కరించేందుకు ఏఐని శక్తివంతంగా మార్చాలని సూచించారు. ఈ సందర్భంగా, తాను ఓపెన్‌ఏఐతో కలిసి 'సీక్రెట్ మౌంటైన్' అనే ప్రాజెక్ట్‌పై గత మూడేళ్లుగా పనిచేస్తున్నట్టు రెహమాన్ వెల్లడించారు. మానవ సృజనాత్మకతను, ఏఐ సామర్థ్యాన్ని కలిపి భారత్ నుంచి ప్రపంచస్థాయి ఐపీని సృష్టించడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌కు సామ్ ఆల్ట్‌మన్ సాంకేతిక సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.



## 10 వేల క్యాలరీలు తిన్నాడు.. నిద్రలోనే పోయాడు!

మాస్కో: రష్యాలో ఓ విషాద ఘటన చోటుచేసుకుంది. తన క్లయింట్లలో స్ఫూర్తి నింపేందుకు సరికొత్త ఛాలెంజ్ ను స్వీకరించిన ఓ ఫిట్‌నెస్ కోచ్, ఆ ప్రయత్నంలోనే ప్రాణాలు కోల్పోయాడు. బరువు తగ్గే కార్యక్రమాన్ని ప్రమోట్ చేయడం కోసం, తానే స్వయంగా బరువు పెరిగి చూపించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో అతిగా ఆహారం తిని గుండెపోటుతో మరణించాడు. వివరాల్లోకి వెళితే.. రష్యాలోని ఒరెన్‌బర్గ్ నగరానికి చెందిన 30 ఏళ్ల డిమిత్రి నుయాంజిన్, ఫిట్‌నెస్ కోచ్‌గా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా పనిచేస్తున్నాడు. తన బరువు తగ్గించే ప్రోగ్రామ్‌కు ప్రచారం కల్పించేందుకు, ముందుగా 25 కిలోల బరువు పెరిగి, ఆ తర్వాత దాన్ని తగ్గించి చూపించాలని ఓ ఛాలెంజ్ ప్రారంభించాడు. ఇందులో భాగంగా కొన్ని వారాలుగా రోజూ 10,000 క్యాలరీలకు పైగా జంక్ ఫుడ్ తినడం మొదలుపెట్టాడు. ఉదయం పూట పేస్ట్రీలు, కేకులు, మధ్యాహ్నం మయోన్నైస్‌తో డంప్లింగ్స్, రాత్రి బర్గర్, రెండు చిన్న పిజ్జాలు తినేవాడు. చనిపోవడానికి ఒక రోజు ముందు తాను అనారోగ్యంగా ఉన్నానని, శిక్షణా తరగతులను రద్దు చేసుకుంటున్నానని స్నేహితులకు తెలిపాడు. అయితే, ఆ మరుసటి రోజే నిద్రలోనే గుండె ఆగిపోవడంతో మరణించాడు. ఈ నెల 18న పెట్టిన తన చివరి ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తాను నెల రోజుల్లోనే 13 కిలోలు పెరిగి 105 కిలోలకు చేరుకున్నట్లు పేర్కొన్నాడు. నుయాంజిన్ మరణవార్తతో సోషల్ మీడియాలో చాలా మంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలుపుతూనే, ఇలాంటి విపరీతమైన ఛాలెంజ్‌లు ఎంత ప్రమాదకరమో ఈ ఘటన గుర్తుచేస్తోందని పలువురు కామెంట్లు పెట్టారు. పదేళ్లుగా ఫిట్‌నెస్ కోచ్‌గా పనిచేస్తున్న నుయాంజిన్ మృతి అందరినీ కలచివేసింది.

## ఇండోనేషియాలో మళ్లీ భారీ భూకంపం

జకార్తా: ఇండోనేషియాలో ఈ ఉదయం భారీ భూకంపం సంభవించింది. సుమత్రా దీవిలోని ఏస్ ప్రావిన్స్ సమీపంలో భూమి తీవ్రంగా కంపించినట్లు ఇండోనేషియా వాతావరణ, క్లైమాటాలజీ, జియోఫిజిక్స్ ఏజెన్సీ (బీఎంకేజీ) వెల్లడించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.3గా నమోదైనట్లు అధికారులు ధ్రువీకరించారు. భూ అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. ఈ భూప్రకంపనల ప్రభావంతో ఏస్ ప్రావిన్స్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు తీవ్రంగా కంపించాయి. దీంతో ఇళ్లలో ఉన్న ప్రజలు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. అయితే, ఈ భూకంపం వల్ల సునామీ ముప్పు ఏమీ లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. పసిఫిక్ మహాసముద్రంలోని 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఇండోనేషియా ఉండటం వల్ల ఇక్కడ తరచూ భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు సంభవిస్తుంటాయి.

## మెడికల్ కాలేజీల్లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: ప్రైవేట్ మెడికల్ కళాశాలలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రత్యేక దృష్టి సారించాయి. గురువారం దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు జరుగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 10 రాష్ట్రాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. సీబీఐ కేసు ఆధారంగానే ఈ తనిఖీలు జరుగుతున్నట్లు అధికార వర్గాలు ధృవీకరించాయి. ఎన్ఎంసీ ప్రమాణాలు పాటించకుండానే అప్రూవల్స్ నేపథ్యంతో ఈ రైడ్స్ జరుగుతున్నట్లు సమాచారం. కొన్ని రోజుల క్రితం మెడికల్ కౌన్సిల్ సభ్యులతో పాటు మెడికల్ కళాశాలల ప్రతినిధులను సీబీఐ ప్రశ్నించింది కూడా. ఈ క్రమంలో ఇవాళ ఇటు ఈడీ ప్రత్యక్ష దాడులకు దిగడం గమనార్హం. ఏపీ, తెలంగాణల్లోని పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఈడీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. పలు కీలక డాకుమెంట్లను పరిశీలిస్తున్న అధికారులు.. మెడికల్ సీట్ల కేటాయింపులు సహా పలు అంశాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

## కొత్త లేబర్ చట్టాల్లో ఉన్న పాయింట్స్ ఇవే..

కొత్త లేబర్ చట్టాల్లో 'వేతనం' అనే దానికి అర్థం పూర్తిగా మారిపోయింది. గతంలో మీ జీతంలో 30శాతమో, 40 శాతమో బేసిక్ శాలరీ ఉండేది. మిగిలినది అలవెన్సులు, పీఎఫ్, అంటూ ఇతరత్రా ఉండేవి. అప్పుడు మీ టేక్ హోమ్ శాలరీ ఎక్కువ వచ్చేది. అయితే, కొత్త చట్టాల ప్రకారం మీ జీతంలో సగం కచ్చితంగా బేసిక్ శాలరీ ఉండాలి. అంటే బేసిక్ శాలరీని ఆధారంగా చేసుకుని పీఎఫ్, ఇతరత్రా కటింగ్స్ ఉంటాయి కాబట్టి బేసిక్ శాలరీ 50శాతం ఉంటే డిడక్షన్స్ పెరుగుతాయన్నమాట. అంటే మీ పీఎఫ్ కటింగ్ ఎక్కువ ఉంటుంది. అయితే, లాంగ్ రన్‌లో చూసుకుంటే మీ పీఎఫ్ పెరుగుతుంది. అంటే రిటైర్మెంట్ సమయానికి మీకు ఆర్థిక భరోసా ఉంటుంది. కేంద్రం ఉద్దేశం కూడా అదే.

**గ్రాట్యుటీ 5ఏళ్ల నుంచి ఏడాదికి తగ్గింపు ..**

గతంలో ఒక ఉద్యోగి గ్రాట్యుటీకి అర్హత సాధించాలంటే ఆ కంపెనీలో కనీసం ఐదేళ్లు పని చేసి ఉండాలి. ఆ తర్వాత ఏదైనా కారణాలతో రాజీనామా చేసినా, రిటైర్ అయినా, లేకపోతే కంపెనీనే తీసేసినా అప్పుడు ఆ గ్రాట్యుటీ డబ్బు తీసుకోవడానికి వీలుండేది. కొత్త చట్టాల ప్రకారం ఏడాది పాటు పనిచేస్తే గ్రాట్యుటీకి అర్హత సాధిస్తారు. సాధారణంగా కంపెనీలు ఒక ఏడాది, రెండేళ్ల కోసం ప్రాజెక్ట్ ఆధారంగా లేకపోతే షార్ట్ టర్మ్ కోసం ఉద్యోగులను తీసుకుంటాయి. అలా ఉద్యోగాల్లో చేరిన వారికి కూడా ఇది లాభదాయకం. ఆ ప్రాజెక్టు అయ్యాక బయటకు వచ్చే సరికి కొంత గ్రాట్యుటీ వస్తుంది.

**అపాయింట్ మెంట్ లెటర్స్ తప్పనిసరి ..**

కంపెనీలు ఉద్యోగులను తీసుకునేటప్పుడు అపాయింట్ మెంట్ లెటర్స్ కొన్ని కంపెనీలు ఇస్తాయి. చాలా కంపెనీలు ఇవ్వవు. కానీ, కొత్త లేబర్ చట్టాల ప్రకారం అపాయింట్ మెంట్ లెటర్స్ తప్పనిసరి. అది ఏ రంగానికి చెందిన కంపెనీ అయినా సరే.. అపాయింట్ మెంట్ లెటర్లు లేకుండా ఉద్యోగులను జాబ్ లోకి తీసుకోవడానికి వీల్లేదు. దీని వల్ల ఒక వ్యక్తి కంపెనీలో జాబ్ లో చేరుతుంటే వాళ్ల రోల్ ఏంటి? రెస్పాన్సిబులిటీ ఏంటి? రూల్స్ ఏంటి? జీతం ఎంత అనేది క్లారిటీగా ఉంటుంది.

**ఓవర్ టైమ్ చేస్తే డబుల్ పేమెంట్ ..**

కొత్త లేబర్ చట్టాల ప్రకారం ఒక ఉద్యోగి లేదా కార్మికుడు ఓవర్ టైమ్ వర్క్ చేస్తే వాళ్లకు కంపెనీ డబుల్ పేమెంట్ ఇవ్వాలి. అలాగే, గతంలో 240రోజులు పనిచేస్తేనే ఉద్యోగులకు వార్షిక సెలవులు కలిసేవి. ఇప్పుడు 180 రోజులు పనిచేస్తే చాలు ఉద్యోగులకు యాన్యువల్ లీవ్స్ కి అర్హత పొందుతారు.

**మహిళలకు కూడా నైట్ షిఫ్టులు ..**

ఆడ, మగ సమానం. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు. అది ఏ రంగంలో కూడా మహిళలకు అన్యాయం జరగకూడదు. లింగ సమానత్వంలో భాగంగా మహిళలకు కూడా నైట్ షిఫ్ట్ డ్యూటీలు చేయడానికి కొత్త లేబర్ చట్టంలో అవకాశం కల్పించారు. అయితే, మహిళలకు రవాణా సదుపాయం కల్పించాలి. మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించి కంపెనీలు చర్యలు తీసుకోవాలి.


లగ్జరి చిత్రం






## శివజ్యోతి ఆధార్ బ్లాక్ చేయలేదు!

ప్రముఖ యాంకర్ శివజ్యోతికి సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న ఒక ప్రచారంపై తీవ్ర గందరగోళం నెలకొన్న విషయం తెలిసిందే. తిరుమల తిరుపతి దేవస్థానంకి చెందిన అధికారులు శివజ్యోతి ఆధార్ కార్డును బ్లాక్ చేశారని.. ఇకపై ఆమెను శ్రీవారి దర్శనానికి అనుమతించరని వార్తలు వస్తున్నాయి. అయితే ఈ వార్తల్లోఎలాంటి వాస్తవం లేదని తెలుస్తోంది. టీటీడీ చరిత్రలో ఏ ఒక్క భక్తుడిని లేదా భక్తురాలిని ఏడుకొండల వెంకన్న స్వామి దర్శనానికి రావొద్దని టీటీడీ ఎప్పుడూ చెప్పలేదని ఈ ప్రచారం కేవలం నిరాధారమైనదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇతర మతాలకు చెందిన భక్తులు కూడా డిక్లరేషన్ (స్వామివారిపై విశ్వాసం) సమర్పించి శ్రీవారిని దర్శించుకునే అవకాశం టీటీడీ కల్పిస్తుంది. అలాంటిది ఒక హిందూ భక్తురాలిని నిలిపివేసే అవకాశం లేదని స్పష్టమవుతోంది. శివజ్యోతి ఇటీవల శ్రీవారి ప్రసాదం గురించి కొన్ని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన మాట వాస్తవం. అయితే, భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని గ్రహించిన వెంటనే ఆమె క్షమాపణ చెప్పింది. ఆమె కూడా శ్రీనివాసుడి భక్తురాలు కావడం, ప్రస్తుతం ఆమె గర్భవతిగా ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రోలింగ్ ఆపాలని పలువురు నెటిజన్లు విజ్ఞప్తి చేస్తున్నారు. క్షమాపణ చెప్పిన తర్వాత కూడా ఒక మహిళను, ముఖ్యంగా గర్భిణిని లక్ష్యంగా చేసుకుని వేధించడం, ట్రోలింగ్ చేయడం సరికాదని భక్తులు కోరుతున్నారు.




## ఘనంగా రాహుల్ సిప్లిగంజ్ పెళ్లి

గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తన ప్రియురాలు హరిణ్య రెడ్డిని హైదరాబాద్‌లో వివాహం చేసుకున్నాడు. హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన ఈ పెళ్లి వేడుకకు పలువురు సినీరాజకీయ రంగ ప్రముఖులు హాజరయ్యారు. ఏపీ టీడీపీ నేత, సుడా ఛైర్మన్ కోటం రెడ్డి శ్రీనివాసులు రెడ్డి సోదరుడి కుమార్తె హరిణ్య రెడ్డి. ప్రీవెడ్డింగ్ లో భాగంగా నిర్వహించిన సంగీత్ కార్యక్రమంలో టీమిండియా క్రికెటర్ యజ్వేంద్ర చాహల్ ప్రత్యక్షమవ్వడం బిగ్ సర్ ప్రైజ్. రాహుల్- హిరణ్య జంటతో చాహల్ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి.



## మా ఫ్యామిలీ కలిసిపోవాలి


మంచు ఫ్యామిలీలో గొడవలు జరుగుతున్న సమయంలో మోహన్ బాబు కూతురు, నటి మంచు లక్ష్మి స్పందించకపోవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. అంత జరుగుతున్నా.. ఎందుకు స్పందించడం లేదని అంతా మాట్లాడుకున్నారు. ఇప్పుడు తొలిసారిగా ఓ ఇంటర్వ్యూలో మంచు కుటుంబంలో విభేదాలపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు లక్ష్మి. ముందుగా దేవుడు ప్రత్యక్షమై ఒక వరం కోరుకోమంటే మాత్రం తాను తన కుటుంబం మళ్లీ పాత రోజుల్లానే ఒక్కటిగా మారాలని మాత్రమే కోరుకుంటానని చెప్పుకొచ్చారు. అందరూ కూడా ఎలాంటి తేడాలు లేకుండా కలిసి ఉండేలా చూడాలని దేవుడిని వేడుకుంటానని తెలిపారు. నిజానికి.. ప్రతి ఫ్యామిలీలో కూడా గొడవలు సహజమేనని అన్నారు. కానీ ఎన్ని వివాదాలు వచ్చినా చివరకు కుటుంబమే మిగులుతుంది కదా అంటూ వ్యాఖ్యానించారు. అయితే ఇండియన్ ఫ్యామిలీస్ లో కొన్నిసార్లు చిన్న కారణాలకే పెద్ద పెద్ద దూరాలు ఏర్పడతాయని అన్నారు. కొందరు వ్యక్తులు జీవితాంతం పూర్తిగా కలవకూడదనే నిర్ణయాలు కూడా తీసుకుంటారని అభిప్రాయపడ్డారు. కానీ ఎవరికైనా చివరకు నిలిచేది.. మిగిలేది రక్తసంబంధీకులేని అన్నారు. కుటుంబంతో ఉండేందుకు ఎన్ని ప్రయత్నాలైనా చేయాలని, దూరాన్ని పెంచుకోకూడదని క్లారిటీ ఇచ్చారు. తాను ముంబయిలో ఉండడం వల్ల కుటుంబ విషయాల గురించి పట్టించుకోలేదని వచ్చిన వార్తలు రావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ సమయంలో తాను ఎంత బాధపడ్డానో తనకు మాత్రమే తెలుసని అన్నారు మంచు లక్ష్మి.




## ధనుష్‌తో అమరన్ రిపీట్

గత ఏడాది కోలీవుడ్ నుంచి వచ్చిన 'అమరన్' సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆర్మీ మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన అమరన్ సినిమాను కమల్ హాసన్ నిర్మించాడు. ఈ సినిమాకు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించాడు. ఒక బయోపిక్ ను అది కూడా ఒక ఆర్మీ ఆఫీసర్ బయో పిక్ ను ఇంత చక్కగా, కమర్షియల్ ఎలిమెంట్స్ మరీ ఎక్కువ కాకుండా నేచురల్‌గా తీశాడు అంటూ దర్శకుడిపై ప్రశంసలు కురిపించారు. కేవలం తమిళ్, తెలుగు భాషల్లోనూ కాకుండా అమరన్ సినిమా అన్ని భాషల్లోనూ మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో దర్శకుడు రాజ్ కుమార్ పెరియ సామికి వరుస ఆఫర్లు వచ్చినట్లు తమిళ మీడియాలో కథనాలు వచ్చాయి. కానీ ఆయన మాత్రం ఆచితూచి తన తదుపరి సినిమా విషయంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎట్టకేలకు ఈయనకు ధనుష్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించిందనే వార్తలు వస్తున్నాయి. ధనుష్ హీరోగా రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఒక సినిమాకు ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా ఈ సినిమాలో హీరోయిన్‌గా సాయి పల్లవిని ఎంపిక చేశారని తెలుస్తోంది. అమరన్ సినిమా కోసం రాజ్ కుమార్ పెరియసామి, సాయి పల్లవి కలిసి వర్క్ చేసిన విషయం తెల్సిందే.

## స్పిరిట్ సెట్‌లోకి అడుగుపెట్టిన ప్రభాస్



సందీప్ రెడ్డి వంగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' సెట్స్ లోకి ప్రభాస్ ఈరోజే అడుగుపెట్టాడు. మొన్నటి వరకు రాజా సాబ్, ఫౌజీ సినిమాల కోసం డేట్స్ అడ్జస్ట్ చేస్తూ షూటింగ్స్ లో బిజీగా గడిపాడు. కానీ ఇప్పుడు సీన్ మారింది. కేవలం సీరియస్ పోలీస్‌గానే కాకుండా, ఖైదీగా కూడా ప్రభాస్ కనిపించబోతున్నాడని రీసెంట్ గా వచ్చిన డార్క్ ఆడియో టీజర్ తో క్లారిటీ వచ్చింది. ఇప్పుడు అదే ఇంటెన్సిటీతో షూటింగ్ మొదలైంది. వాస్తవానికి ఈ సినిమాకు కూడా ప్రభాస్ మిగతా సినిమాల్లాగే డేట్స్ అడ్జస్ట్ చేద్దామని అనుకున్నాడట. కానీ సందీప్ వంగా మాత్రం దానికి ఒప్పుకోలేదు. లుక్ విషయంలో, క్యారెక్టర్ మూడ్ విషయంలో చాలా పర్టిక్యులర్ గా ఉండే వంగా.. తనకు బల్క్ డేట్స్ కావాల్సిందేనని పట్టుబట్టాడట. కల్ట్ మాస్టర్ పీస్ రావాలంటే ఆ మాత్రం డెడికేషన్ అవసరమని, ఆ లుక్ మెయింటైన్ చేయడం ముఖ్యమని ప్రభాస్ కూడా ఫిక్స్ అయ్యాడు. దీంతో మొత్తానికి ప్రభాస్ బల్క్ డేట్స్ ఇచ్చేసి సందీప్ వంగా జైలులోకి ఎంట్రీ ఇచ్చేశాడు. రాబోయే రెండు నెలల పాటు ప్రభాస్ పూర్తిగా వంగా కాంపౌండ్ లోనే ఉండబోతున్నాడు.



## అనుపమ 'లాక్‌డౌన్' ట్రైలర్ విడుదల

మలయాళీ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన ఎమోషనల్ సర్వైవల్ థ్రిల్లర్ 'లాక్‌డౌన్'. ఈ సినిమాకు ఏ. ఆర్. జీవా దర్శకత్వం వహించగా.. లైకా ప్రోడక్షన్ నిర్మిస్తుంది. ఇప్పటికే అంతర్జాతీయ చలన చిత్రోత్సవం లో ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం తాజాగా థియేటర్‌లలో విడుదల కాబోతుంది. తాజాగా ఈ సినిమాను డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే కరోనా మహమ్మారి వలన ఇండియాలో లాక్‌డౌన్ పడిన అనంతరం జరిగిన పరిస్థితులు ఏంటి అనేది ఈ సినిమా కథ అని తెలుస్తుంది. అనుపమ పరమేశ్వరన్ ఇందులో 'అనిత' అనే పాత్రను పోషిస్తోంది.




## తలైవాతో నేచురల్ బ్యూటీ

సూపర్ స్టార్ రజినీకాంత్ 173వ సినిమాలో నేచురల్ బ్యూటీ సాయిపల్లవి ఎంట్రీ ఇవ్వబోతోందట. కూలీ, జైలర్ 2 సినిమాలు లైన్లో ఉండగానే రజనీ మరో భారీ సినిమాను పట్టాలెక్కిస్తున్నారు. ఈ సినిమాలో సాయిపల్లవి ఎంట్రీతో ఈ ప్రాజెక్ట్ వాల్యూ అమాంతం పెరిగిపోయింది. కేవలం గ్లామర్ కోసం కాకుండా, నటనకు ఆస్కారం ఉంటే తప్ప ఓకే చెప్పని ఆ భామ, తలైవా సినిమాకు సై అనడం ఇప్పుడు హాట్ టాపిక్. సాధారణంగా స్టార్ హీరోల సినిమాల్లో హీరోయిన్లకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు. అందుకే మన 'న్యాచురల్ బ్యూటీ' సాయి పల్లవి పెద్ద హీరోల సినిమాలను చాలాసార్లు సున్నితంగా తిరస్కరించారు. గతంలో ఒక పెద్ద హీరో ఆఫర్ ను కూడా ఆమె వద్దన్న విషయం తెలిసిందే. అలాంటిది ఇప్పుడు రజినీకాంత్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందంటే.. అందులో కంటెంట్ ఏ రేంజ్ లో ఉందో అర్థం చేసుకోవచ్చు.



# ముగిసిన డబ్ల్యూపీఎల్ వేలం



## మొత్తం ఐదు జట్లు ఇవే!

**దేశరాజధాని న్యూఢిల్లీ వేదికగా జరిగిన వుమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 మెగా వేలం ముగిసింది. గురువారం జరిగిన ఈ మెగా ఆక్షన్‌లో ఐదు ఫ్రాంచైజీలు అమ్మాయిలపై కనకవర్షం కురిపించాయి. భారీ పర్స్‌మనీతో బరిలోకి దిగిన యూపీవారియర్స్ ఎక్కువమంది ఆటగాళ్లను కొనుగోలు చేసింది. టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మతో పాటు అమేలియా కేర్, శిఖా పాండే, సోఫీ డివైన్ భారీ ధరను దక్కించుకోగా.. తెలుగు తేజం శ్రీచరణికి జాక్‌పాట్ ధర లభించింది. 277 మంది ఆటగాళ్లను వేలం వేయగా.. ఫ్రాంచైజీలు 73 మంది ప్లేయర్లను కొనుగోలు చేశాయి.**

**1. ముంబై ఇండియన్స్:** హర్మన్‌ప్రీత్ కౌర్, నాటాలీ సైవర్–బ్రంట్, హేలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, జి. కమలిని, అమేలియా కెర్, షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా, సజీవన్ సజనా, రహీలా ఫిర్దౌస్, నికోలా కారీ, పూనమ్ ఖేమ్నార్, త్రివేణి వశిష్ట, నల్ల రెడ్డి, సైకా ఇషాక్, మిల్లీ ఇల్లింగ్‌వర్త్.

**2. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు:** స్మృతి మంధాన, రిచా ఘోష్, ఎల్లీస్ పెర్రీ, శ్రేయాంక పాటిల్, జార్జియా వోల్, నడిన్ డి క్లెర్క్, రాధా యాదవ్, లారెన్ బెల్, ప్రేమ రావత్, అరుంధతి రెడ్డి, పూజా వస్త్రాకర్, గ్రేస్ హారిస్, గౌతమి నాయక్, ప్రాత్యూష కుమార్, దయాలన్ హేమలత.

**3. ఢిల్లీ క్యాపిటల్స్:** జెమీమా రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, అన్నబెల్ సదర్లాండ్, మారిజన్నే కాప్, నికి పిఆర్సాద్, చినెల్ హెన్రీ, ఎన్. చరణి, లారా వోల్వార్ట్, స్నేహ్ రాణా, మిన్ను మణి, లిజెల్ లీ, తానియా భాటియా, నందిని శర్మ, దీయా యాదవ్, మమత మడివాళ, లూసీ హామిల్టన్.

**4. గుజరాత్ జెయింట్స్:** బెత్ మూనీ, ఆష్లీ గార్డ్‌నర్, సోఫీ డివైన్, జార్జియా వేర్‌హామ్, భారతి ఫుల్‌మాలి, కష్వీ గౌతమ్, రేణుకా సింగ్, కిమ్ గార్త్, యస్తికా భాటియా, డాన్నీ వ్యాట్, తనుజా కన్వర్, అనుష్క శర్మ, రాజేశ్వరి గైక్వాడ్, టిటాస్ సాధు, కనికా అహుజా, ఆయుషి సోని, హ్యాపీ కుమారి, శివానీ సింగ్.

**5. యూపీ వారియర్స్:** శ్వేతా సెహ్రావత్, దీప్తి శర్మ, శిఖా పాండే, మెగ్ లానింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, ఆశ శోభన, సోఫీ ఎక్లెస్టోన్, డియాండ్రా డాటిన్, కిరణ్ నవగిరే, హర్లీన్ డియోల్, క్రాంతి గౌడ్, ప్రతీక రావల్, క్లో ట్రయాన్, షిప్రా గిరి, సిమ్రాన్ షేక్, తారా నోరిస్, సుమన్ మీనా, జి. త్రిష.

## శ్రీచరణికి 1.3 కోట్లు

వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) మెగా వేలంలో టీమిండియా స్టార్ స్పిన్నర్, తెలుగు తేజం శ్రీ చరణికి రూ.1.30 కోట్ల ధర దక్కింది. రూ.30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన శ్రీచరణి కోసం యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తీవ్రంగా పోటీపడ్డాయి. చివరకు ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.30 కోట్ల రికార్డ్ ధరకు సొంతం చేసుకుంది. గత సీజన్‌లోనూ శ్రీ చరణి ఢిల్లీ క్యాపిటల్స్‌కే ఆడింది. రూ.50 లక్షల భారీ ధరకు ఈ తెలుగు తేజాన్ని ఢిల్లీ కొనుగోలు చేసింది. డబ్ల్యూపీఎల్ 2025 సీజన్‌లో రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడిన శ్రీ చరణి.. 4 వికెట్లతో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చింది. ఈ అద్భుత ప్రదర్శనతోనే టీమిండియాకు ఆడే అవకాశం అందుకున్న శ్రీచరణి ఏకంగా.. మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీకి ఎంపికైంది. మెగా టోర్నీలో 21 ఏళ్ల శ్రీ చరణి అదరగొట్టింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ అయిన ఈ ఆంధ్రా అమ్మాయి 9 మ్యాచ్‌ల్లో 4.96 ఎకానమీతో 14 వికెట్లు పడగొట్టింది. ఈ 9 మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచ్ మినహా.. ప్రతీ మ్యాచ్‌లో వికెట్ తీసింది. ముఖ్యంగా సెమీస్, ఫైనల్లో ఆమె కట్టుదిట్టమైన బౌలింగ్ టీమిండియా విజయానికి బాటలు వేసింది. ఈ టోర్నీలో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచింది. ఈ ప్రదర్శనే వేలంలో శ్రీ చరణి కోట్లు పలికేలా చేసింది.



శ్రీచరణి

## అలిస్సా హీలీకి నిరాశ

### పలువురు స్టార్ ప్లేయర్లకు షాక్

వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) 2026 మెగా వేలంలో కొంతమంది స్టార్ ఆటగాళ్లకు నిరాశే ఎదురైంది. న్యూఢిల్లీ వేదికగా గురువారం జరిగిన ఈ మెగా వేలంలో 77 స్థానాల కోసం 277 మంది ప్లేయర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. అయితే, పలు కీలక క్రికెటర్లు వేలంలో అమ్ముడుపోలేదు.

**అన్‌సోల్డ్ క్యాప్డ్ ప్లేయర్స్:**

అలిస్సా హీలీ, సబ్బినేని మేఘన, టాజ్మిన్ బ్రిట్స్, ఇజ్జి గేజ్, అమీ జోన్స్, ఉమా చేత్రి, డార్సీ బ్రౌన్, లారెన్ చీటిల్, ప్రియా మిశ్రా, అమాండా జేడ్ వెల్లింగ్‌టన్, అలనా కింగ్, మారుఫా అక్తర్, లీ తహుహు, ఈడెన్ కార్సన్, ఫ్రాన్ జోనస్, శుచి ఉపాధ్యాయ్, హెథర్ గ్రాహం, తేజల్ హసబ్నిస్, రబేయా ఖాన్, అలిస్ కాప్సీ, సైమా ఠాకూర్, సాయలీ సత్ఘరే, ఇస్సీ వాంగ్.

**అన్‌సోల్డ్ అన్‌క్యాప్డ్ ప్లేయర్స్:**

ప్రణవి చంద్ర, డెవినా పెర్రిన్, వృంద దినేష్, దిశా కసత్, ఆరుషి గోయెల్, సానికా చాల్కే, హుమైరా ఖాజీ, అమన్‌దీప్ కౌర్, జింటిమణి కలితా, యశశ్రీ ఎస్, ఖుషి భాటియా, నందిని కశ్యప్, కోమల్‌ప్రీత్ కౌర్, మిల్లీ ఇల్లింగ్‌వర్త్, షబ్నమ్ షకీల్, ప్రకాశికా నాయక్, భారతి రావల్, ప్రియాంక కౌశల్, పరునికా సిసోడియా, జగ్రవి పవార్, స్నేహ దీప్తి, మోనా మేష్రామ్, ప్రియా పూనియా, నుజత్ పర్వీన్, సలోని డాంగోరే, లారా హారిస్, తీర్థ సతీష్, సహానా పవార్, కోర్ట్నీ వెబ్, తారా నోరిస్, శివాలీ షిండే, షాను సేన్, అశ్వని కుమారి, వైష్ణవి శర్మ, గార్గి వంకర్, ప్రగతి సింగ్, ఆయుషి శుక్ల.

## అమ్ముడుపోయిన తెలుగు ప్లేయర్స్

**శ్రీ చరణి(ఢిల్లీ క్యాపిటల్స్)–1.30 కోట్లు**
**అరుంధతి రెడ్డి(ఆర్‌సీబీ)–75 లక్షలు**
**త్రిష(యూపీ వారియర్స్)–10 లక్షలు**
**అన్‌సోల్డ్ తెలుగు ప్లేయర్లు: కే హాసిని, లక్ష్మీ ప్రసన్న, సబ్బినేని మేఘన, స్నేహ దీప్తి, మమత మడివాళ, భవ్య కస్తూరి, సుజాత.**

## సారీ ఫ్యాన్స్.. క్షమించండి: పంత్



భారత క్రికెట్ అభిమానులకు టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ క్షమాపణలు చెప్పాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయామని, తమను మన్నించాలని కోరాడు. గౌహతి వేదికగా బుధవారం ముగిసిన రెండో టెస్ట్‌లో సౌతాఫ్రికా 408 పరుగుల భారీ తేడాతో టీమిండియాను చిత్తు చేసిన సంగతి తెలిసిందే. ఈ విజయంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2–0తో సౌతాఫ్రికా క్లీన్ స్వీప్ చేసింది. 25 ఏళ్ల తర్వాత భారత గడ్డపై టెస్ట్ సిరీస్ గెలుపొందింది. వరుసగా రెండో ఏడాది టెస్ట్ సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ అయ్యింది. దాంతో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు ఆటగాళ్లపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ సిరీస్‌కు రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ నొప్పితో దూరమవడంతో వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్ జట్టును నడిపించాడు. కానీ 93 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలోనే ఏన్నడు లేని పరాజయాన్ని టీమిండియా చవిచూసింది. ఈ క్రమంలోనే అభిమానులకు క్షమాపణలు చెబుతూ రిషభ్ పంత్ సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ పంచుకున్నాడు. 'గత రెండు వారాలుగా మేం సరిగ్గా ఆడలేదనేది నగ్న సత్యం. జట్టుగా.. వ్యక్తిగతంగా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాలని, కోట్లాది మంది భారతీయుల ముఖాల్లో చిరునవ్వు తీసుకురావాలని కోరుకుంటాం. కానీ ఈ సారి మేం మీ అంచనాలను అందుకోలేకపోయాం. అందుకు మమ్మల్ని క్షమించండి. కానీ క్రీడల్లో ఓటమి ఎప్పుడూ జట్టుగా.. వ్యక్తిగతంగా గుణపాఠం నేర్పుతుంది. మరింత మెరుగవ్వాలని విషయాన్ని సూచిస్తుంది. భారత్ దేశానికి ప్రాతినిథ్యం వహించడం మా జీవితాల్లోనే మాకు దక్కిన అతిపెద్ద గౌరవం.



దీప్తి శర్మ

## మళ్లీ ఢిల్లీకే రావడం ఆనందంగా ఉంది

**వేలంలో భారీ ధర పలికినందుకు చాలా సంతోషంగా ఉంది. వేలానికి ముందే ఏదో ఓ జట్టు తరఫున నేను ఈ టోర్నీలో భాగమవుతానని ఆశించాను. కానీ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి తిరిగి రావడం చాలా సంతోషంగా ఉంది. ఢిల్లీ నాకు హోమ్ టీమ్. ఢిల్లీ జట్టులో మళ్లీ భాగమైనందుకు చాలా గర్వంగా ఉంది. జట్టు విజయాల్లో భాగమయ్యేందుకు, నా సత్తా చూపించేందుకు నాకు దక్కిన మరో అవకాశంగా భావిస్తున్నా. అప్‌కమింగ్ సీజన్ కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా. స్టార్ ఆటగాళ్లతో మా జట్టు బలంగా ఉంది. అంతా మంచే జరుగుతుందని ఆశిస్తున్నా. మేమంతా కలిసి టైటిల్ గెలిచే ప్రయత్నం చేస్తాం.** **-శ్రీచరణి**

## తెలంగాణ బిడ్డకు జాక్‌పాట్

వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) మెగా వేలంలో టీమిండియా పేసర్, తెలంగాణ బిడ్డ అరుంధతి రెడ్డికి జాక్‌పాట్ ధర లభించింది. ఈ హైదరాబాద్ పేసర్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) రూ.75 లక్షల రికార్డ్ ధరకు కొనుగోలు చేసింది. రూ.30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన అరుంధతి రెడ్డి కోసం తన పాత ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌తో పాటు ఆర్‌సీబీ, గుజరాత్ జెయింట్స్ పోటీ పడింది. చివరకు ఆర్‌సీబీ రూ.75 లక్షల ధరకు సొంతం చేసుకుంది. గత మూడు డబ్ల్యూపీఎల్ సీజన్లలో రూ.30 లక్షల కనీస ధరతో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడిన ఈ హైదరాబాద్ పేసర్.. ఇప్పటి వరకు 20 మ్యాచ్‌లు ఆడి 17 వికెట్లు తీసింది. టీమిండియా కీలక సభ్యురాలైన అరుంధతి రెడ్డి గాయం కారణంగా వన్డే ప్రపంచకప్ 2025 టోర్నీలో ఒక్క మ్యాచ్ ఆడలేదు. కానీ ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది. ఎక్స్‌ట్రా ప్లేయర్‌గా టీమిండియాకు సేవలందించింది. సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా అద్భుతమైన క్యాచ్‌లు అందుకుంది. ఈ విజయం నేపథ్యంలోనే అరుంధతి రెడ్డికి రెట్టింపు ధర దక్కింది.






## ప్రపంచకప్ వారియర్‌కు 1.10 కోట్లు

డబ్ల్యూపీఎల్ మెగా వేలంలో సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ రికార్డ్ ధరను సొంతం చేసుకుంది. దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా గురువారం జరిగిన మెగా వేలంలో ఈ సౌతాఫ్రికా ప్లేయర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.10 కోట్లకు దక్కించుకుంది. రూ.30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన లారా వోల్వార్ట్ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళురు, ఢిల్లీ క్యాపిటల్స్ తీవ్రంగా పోటీపడ్డాయి. చివరకు ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.10 కోట్లకు సొంతం చేసుకుంది.



# నిద్ర పక్షవాతం

పక్షవాతానికి, నిద్ర పక్షవాతానికి చాలా తేడా ఉంది, నిద్ర పక్షవాతాన్ని, పక్షవాతంతో పోల్చలేము. మన శరీరంలో ఏదైనా భాగానికి పక్షవాతం వస్తే దాదాపు ఆ అవయవం కదలకుండా ఉండిపోతుంది. కానీ నిద్రపక్షవాతంలో కేవలం కొన్ని సెకన్ల పాటు మాత్రమే ఈ పరిస్థితి ఉంటుంది, తర్వాత మన శరీరం యధాస్థితికి వస్తుంది. చాలామందికి నిద్ర పక్షవాతానికి గురైన విషయం కూడా వారికి గుర్తు ఉండదు. నిద్ర పక్షవాతం అంత ప్రమాదకరమైనది కాదు. కానీ దీని లక్షణాల వలన మనం భయాందోళనలకు గురయ్యే అవకాశం ఉంది. నిద్ర పక్షవాతం ఉన్నప్పుడు మెలకువగా ఉన్నా కూడా శరీరాన్ని కదపలేరు. కాళ్ళు కానీ చేతులు కానీ కదిలించడానికి ప్రయత్నం చేసినా వీలు అవ్వదు. ఈ స్థితిలో ఉన్నప్పుడు మీరు మాట్లాడాలి అనుకున్నా కూడా మాట్లాడలేరు. నిద్ర పక్షవాతం ఉన్నప్పుడు కొద్ది క్షణాల పాటు శ్వాస ఆడకపోవడం, ఛాతీ పైన బరువుగా అనిపించడం జరుగుతాయి. కానీ వెంటనే మాములు స్థితికి వచ్చేస్తారు. చుట్టూ ఎవరో ఉన్నట్టు ఏదో జరుగుతున్నట్టు అనిపిస్తుంటుంది, ఇది కలలో కూడా జరగదు, మెలకువలో ఉన్నప్పుడు ఇలాంటి భ్రాంతి చెందుతారు. నిద్ర పక్షవాతం ఉన్నవారికి పగటి పూట నిద్రమత్తు అధికంగా ఉంటుంది.



### నిద్ర పక్షవాతం ఎందుకు వస్తుంది?

నిద్ర పక్షవాతం రావడానికి గల కారణాలు కచ్చితంగా తెలియనప్పటికీ కొన్ని ముఖ్యమైన కారణాల వలన సంభవించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నిద్ర పక్షవాతానికి ముఖ్యమైన కారణం ప్రతీరోజూ సరైన నిద్ర లేకపోవడం, సాధారణంగా మనకి వయసుని బట్టి రోజుకి 7 నుండి 9 గంటల పాటు నిద్ర అవసరం, కానీ ప్రతీరోజూ తక్కువ సమయం నిద్రించే వారిలో ఈ సమస్య వచ్చే అవకాశం ఉంది. రాత్రి సమయాల్లో పని చేసేవారిలో కూడా నిద్ర పక్షవాతం లక్షణాలు కనిపిస్తాయి. నిద్ర వేళల్లో మార్పులు పగటి పూట సరిగా నిద్ర పోకపోవడం రాత్రంతా మేలుకుని పని చేయడం వలన నిద్ర పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది. ప్రతీరోజూ నిద్రపోయే వేళలు క్రమరహితంగా ఉండడం వలన నిద్ర పక్షవాతం సంభవించే ప్రమాదం ఉంది. ఎక్కువగా పని ఒత్తిడి, ఆందోళన కలిగిన వారు ఇతర మానసిక సమస్యలు కలిగిన వారికి నిద్ర పక్షవాతం వచ్చే అవకాశం ఉంది. నార్కోలెప్సీ వ్యాధి ఉన్నవారిలో నిద్ర పక్షవాతంకు సంబంధించిన లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. నార్కోలెప్సీ అంటే ఏదైనా పనిచేస్తున్న సమయంలో కూడా ఉన్నట్టుండి నిద్రలోకి జారుకునే వ్యాధి.

### నిద్రలో ఛాతి బరువుగా ఉంటోందా?

నిద్ర పక్షవాతాన్ని లక్షణాలను బట్టి రెండు రకాలుగా విభజించొచ్చు. ఒకటి.. ఐసోలేటెడ్ స్లీప్ పెరాలసిస్. ఇది నిద్రకు సంబంధించిన సమస్యల వలన కాకుండా ఉన్నఫళంగా సంభవిస్తుంది, నిద్ర, మేల్కొనే సమయానికి మధ్య కొన్ని క్షణాలపాటు కదల్లేని పరిస్థితి ఉంటుంది. ఇది ఎప్పుడైనా ఒక్కసారి ఉన్నట్టుండి జరుగుతుంది. రెండోది.. రిక్కరెంట్ ఐసోలేటెడ్ స్లీప్ పెరాలసిస్. ఇది ఓకే రాత్రి అనేకసార్లు, లేదా తరచుగా ఇలాంటి పరిస్థితికి గురవ్వడాన్ని రిక్కరెంట్ ఐసోలేటెడ్ స్లీప్ పరాలైసిస్ అంటారు.

### నివారణ మార్గాలు


నిద్ర పక్షవాతం ప్రమాదమైన వ్యాధి కాదు. కానీ ఈ పరిస్థితి పేషేంట్ లో తరచుగా కనిపిస్తూ ఉంటే అప్పుడు కొన్ని యాంటీడిప్రెసెంట్ మందులను డాక్టర్లు సూచిస్తారు. కొన్ని రకాలైన వ్యాయామం, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వలన నిద్ర పక్షవాతాన్ని నివారించవచ్చు. చాలామందిలో కనీస శారీరక శ్రమ లేకపోవడం వలన ఆరోగ్యకరమైన నిద్ర పట్టదు, మంచి నిద్ర కోసం డాక్టర్లు సూచించిన తేలికపాటి వ్యాయామాలను చేయవచ్చు. ప్రతీరోజూ రెండు గంటలపాటు నడక కూడా మంచి నిద్రను ప్రేరేపిస్తుంది. కాఫీ, టీ, కూల్ డ్రింక్స్, కెఫిన్ కలిగిన పదార్థాలు నిద్రను దూరం చేస్తాయి, నిద్రలేమి వలన నిద్ర పక్షవాతం వచ్చే అవకాశం ఉంది. అందువలన ఇలాంటి పదార్థాలను తగ్గించాలి. అనేక అనారోగ్యాలకు కారణమయ్యే మద్యపానం, ధూమపానం అలవాట్లు నిద్ర పక్షవాతానికి కూడా కారణమవుతున్నాయి, ఈ అలవాట్లను తగ్గించుకోవడం వలన నిద్రపక్షవాతం రాకుండా నివారించవచ్చు. ప్రస్తుతం అన్నివయసుల వారు సెల్ ఫోన్ లేదా లాప్టాప్ ఎక్కువగా వాడుతుండడం ఎక్కువ అయ్యింది, పనిలో భాగంగానే వీటిని వాడుతున్నా కూడా అనవసరమైన సమయాల్లో టీవీ, మొబైల్ చూడడాన్ని తగ్గించాలి.

**- డాక్టర్ వినమ్ర, లైఫ్ కేర్ హాస్పిటల్స్**

# ఏఐని కంట్రోల్ చేయాల్సిందే


మానవ మేధస్సు సృష్టించిన అత్యంత విప్లవాత్మక సాంకేతికతలలో ఒకటి - కృత్రిమ మేధస్సు(ఏఐ) ఇది మన జీవితంలోని ప్రతి అంగుళంలోకి చొచ్చుకుపోతూ, అపూర్వమైన అవకాశాలను అందిస్తోంది. ఆరోగ్య సంరక్షణలో రోగ నిర్ధారణ నుండి, రవాణాలో స్వయం-చోదక వాహనాల వరకు అద్భుతాలు సృష్టిస్తోంది. అయితే, ఈ వరం వెనుక దాగున్న ముప్పును విస్మరించలేము. నియంత్రణ లేని ఏఐ అభివృద్ధి మానవాళి ఉనికికే సవాలు విసురుతుందని స్టీఫెన్ హాకింగ్, ఎలోన్ మస్క్ వంటి ప్రముఖులు ఎప్పుడో హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, కృత్రిమ మేధస్సును నియంత్రిద్దాం, మానవాళిని రక్షించుకుందాం అనే నినాదం నేడు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

ఏఐ ప్రయోజనాలు, ప్రమాదాలు: కృత్రిమ మేధస్సు సామర్థ్యాలు అపారం. భారీ మొత్తంలో డేటాను తక్కువ సమయంలో విశ్లేషించి, కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఇది మానవ సామర్థ్యాలను అధిగమిస్తుంది. విద్యా బోధనను వ్యక్తిగతీకరించడం, క్యాన్సర్ వంటి వ్యాధుల నిర్ధారణను సులభతరం చేయడం వంటి ఎన్నో మంచి పనులకు ఏఐ ఉపయోగపడుతోంది. అయితే, ప్రతి సాంకేతికతకు రెండు వైపులా పదును ఉంటుంది. ఏఐ విషయంలో ఈ పదును మరింత ప్రమాదకరమైనది. ఏఐ, రోబోటిక్స్ కారణంగా అనేక బ్లూ-కాలర్, వైట్-కాలర్ ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఏఐ అల్గారిథమ్‌లు వాటికి శిక్షణ ఇచ్చిన డేటాలోని పక్షపాతాలను ప్రతిబింబించే అవకాశం ఉంది, ఇది వివక్షపూరిత నిర్ణయాలకు దారితీయవచ్చు. డీప్‌ఫేక్‌ల సృష్టి, ఆయుధాల స్వయంప్రతిపత్తి వంటి వాటికి ఏఐని దుర్వినియోగం చేస్తున్నారు. అత్యంత అధునాతనమైన 'ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్' మానవ నియంత్రణకు మించి పనిచేసే అవకాశం ఉంది, ఇది ఊహించని నష్టాలకు దారితీయవచ్చు. ఈ ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, ఏఐ అభివృద్ధిని నియంత్రించడం తక్షణావసరం. పోప్ ఫ్రాన్సిస్ వంటి ప్రపంచ నేతలు సైతం ఏఐ వినియోగాన్ని నియంత్రించే అంతర్జాతీయ ఒప్పందాలు అవసరమని పిలుపునిచ్చారు. దీని అభివృద్ధి, వినియోగాన్ని పర్యవేక్షించడానికి కఠినమైన జాతీయ చట్టాలు, అంతర్జాతీయ ఒప్పందాలు రూపొందించాలి. బాధ్యతాయుతమైన ఏఐ వినియోగానికి ప్రాధాన్యతనిస్తూ, నైతిక మార్గదర్శకాలను తప్పనిసరి చేయాలి. వ్యవస్థల పనితీరులో పారదర్శకత ఉండేలా చూసుకోవాలి, లోపాలకు బాధ్యత వహించే వ్యవస్థ ఉండాలి. ప్రస్తుతం, భారతదేశం వంటి దేశాలు స్వచ్ఛంద స్వీయ-నియంత్రణ, ఇప్పటికే ఉన్న చట్టాలపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి, ఇది సరిపోదు. ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, న్యాయవ్యవస్థ,



రక్షణ రంగాలలో ఏఐ వినియోగానికి నిర్దిష్టమైన, కట్టుదిట్టమైన నిబంధనలు కావాలి. సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూనే, మానవ కేంద్రీకృత విధానాలను అవలంబించాలి. ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, పౌర సమాజం కలిసికట్టుగా పనిచేసి, ఏఐ అభివృద్ధిని సరైన దిశలో నడిపించాలి. నియంత్రణతో కూడిన ఏఐ అభివృద్ధి మాత్రమే సురక్షితమైన, మెరుగైన భవిష్యత్తుకు మార్గం చూపుతుంది. ఈ దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచించాలి, ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి. మానవాళి భవిష్యత్తును మన చేతుల్లోకి తీసుకుందాం, కృత్రిమ మేధస్సు మనకు సేవ చేసేలా చూసుకుందాం.

**- విలాసాగరపు శ్రీనాథ్, సైబర్ నిపుణుడు**


రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811



OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.